# బాపురమణల

# పురస్కార గ్రహీతలు



చంద్ర

శ్రీరమణ



హైదరాబాద్ : 15-12-2016
బాపు రమణ అకాడెమి (ఆత్రేయపురం : హైదరాబాద్) వారు
డా॥ కె.వి. రమణాచారిగారి ఆధ్వర్యంలో బాపు రమణల పురస్కారాలను
చిత్రకారుడు చంద్రకి ; రచయిత శ్రీరమణకి అందజేశారు



'చంద్రోదయం' వీడియో ప్రెజెంటేషన్ తరువాత చంద్రను సత్కరిస్తున్న డా॥ కె.వి. రమణాచారి. ఆన్‌లుకర్ : 'ముత్యాలముగ్గు' సంగీత



'శ్రీరమణీయం' వీడియో ప్రెజెంటేషన్ తరువాత శ్రీరమణకు ప్రశంసాపత్రం అందిస్తున్న అకాడెమీ కార్యదర్శి వేగిరాజు సుబ్బరాజు

'కౌముది' వెబ్ మాసపత్రిక

మరియు

'రచన' మాసపత్రిక - సంయుక్త నిర్వహణలో

# కథల పోటీ - 2017

**బహుమతులు:** ***పోటీకి వచ్చిన కథలలో ఉత్తమమైన 20 కథలకు ఒక్కొక్కదానికి రూ. 1500 /-***

***అత్యుత్తమ కథ (ఒక కథకి) రూ. 5000 /-***

**రచయిత/త్రులకి సూచనలు**

- కథాంశం ఏదైనా - కుటుంబ సంబంధాలకి, మానవీయ విలువలకి, నవ్యతకి, సృజనాత్మకతకి పెద్దపీట వేసే రచనల్ని ఆహ్వానిస్తున్నాం.
- ఇంతకు ముందు ఎక్కడా (ప్రింట్ పత్రికలలో కానీ, వెబ్ పత్రికలలో కానీ, వ్యక్తిగత బ్లాగులలో కానీ) ప్రచురితం కాని రచనలని మాత్రమే పోటీకి పంపించండి.
- ఇప్పటికే ఎక్కడైనా పరిశీలనలో ఉన్న రచనలు కూడా పోటీకి అర్హం కావు.
- పై అంశాలని ధృవీకరిస్తూ హామీపత్రం తప్పని సరిగా జతపరచాలి. హామీ పత్రం లేని రచనలు పరిశీలించబడవని గమనించగలరు.
- ప్రచురణకు అంగీకరించని వ్రాతప్రతులని త్రిప్పి పంపడం సాధ్యం కాదు. వాటి కాపీలు తీసి ఉంచుకోవడం మంచిది.
- రచనకు ఏ కలం పేరు వాడినా రచయిత/త్రి అసలు పేరు, పూర్తి చిరునామా తప్పని సరిగా వ్రాయాలి.
- పోటీలలో ఏ బహుమతి పొందిన కథనైనా, ఫలితాలు వెలువడిన తరువాత రచయిత/త్రి వెనక్కి తీసుకునే అవకాశం లేదని గమనించండి.
- వ్రాతలో కథ 10 పేజీలు మించకుండా ఉంటే మంచిది.
- పోటీ ఫలితాలు **కౌముది.నెట్** లోనూ, 'రచన' మాసపత్రిక (మే 2017 సంచిక) లోనూ ప్రచురించబడతాయి.
- బహుమతుల విషయంలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.
- బహుమతికి ఎంపిక కాని కథలలో కొన్నింటిని సాధారణ ప్రచురణకు తీసుకోవడం జరుగుతుంది.
- బహుమతి పొందిన కథలు 'కౌముది' వెబ్ పత్రికలో క్రమంగా, రచన మాసపత్రికలో వీలువెంబడి ప్రచురించబడతాయి.

**పోటీ కథలు మాకు అందవలసిన చివరి తేది: ఫిబ్రవరి 5, 2017 ఫలితాల ప్రకటన: మే 1, 2017**

**మీ రచనలు పంపించాల్సిన చిరునామా:** **రచన మాసపత్రిక**

**1-9-286/2/P విద్యానగర్ , హైదరాబాదు 500 044**

లేదా

**కౌముది, 4251 ఎస్క్యుడో కోర్ట్, డబ్లిన్ - 94568, యు.ఎస్.ఎ**

ఇ-మెయిల్: ఎడిటర్ @ కౌముది.నెట్ (కె ఒ యు ఎం యు డి ఐ . నెట్)

సూచన: ఇ -మెయిల్లో పంపించే కథలు యూనికోడ్ ఫార్మాట్‌లో పంపించండి.

**తెలుగు కథా రచనకి ప్రోత్సాహం – ఉత్తమ కథలకి సముచిత పురస్కారం**

సంపుటి : 16
సంచిక : 10
జనవరి:2017

# రచన ఇంటింటిపత్రిక

296

పేజీలు : 100
వెల :
` 30/-

ముఖచిత్రం :: అష్టవిధ నాయికలు - 1. స్వాధీనపతిక :: చిత్రకారుడు : బాపు

చిరునామా : 1-9-286/2/P; "యడ్లపాటివారి ఇల్లు" ; విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర);
హైదరాబాద్ - 500 044 :: ఫోన్ : 040 - 2707 1500
ఇ-మెయిల్ : రచనపత్రిక@జిమెయిల్.కామ్ :: దర్శించండి : డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.రచన.నెట్

సంపాదకీయం 5

కథ-కమామీషు

అనువాదాలూ... స్వానుభవాలూ...
- పాలెపు బుచ్చిరాజు 55

'చిరస్మరణీయం'
పేజీలు : 88 – 99
✪ అత్తా ఒకింటి కోడలే! (బొమ్మల కథ)
రచన : ఆరుద్ర :: బొమ్మలు : బాపు
✪ స్వాధీనపతిక : కవిత : దేవులపల్లి కృష్ణశాస్త్రి

## సీరియల్ రచనలు

జస్టిస్ ఫర్ సేల్(అమ్మకానికి న్యాయం)– బీనాదేవి 11
సిగ్గుమాలినవాడు – క్రొవ్విడి లక్ష్మన్న 25
గగనానికి ఇలకూ బహుదూరం – వసుంధర 62

## శీర్షికలు

పజిలింగ్ పజిల్ – 296 – నిర్వహణ : సుధామ 8
కిరణ్‌ప్రభ కవిత – కరుణాకర్ రేఖాచిత్రం 18
ఫేమిలో ఆల్బమ్
– మల్లాది వెంకట కృష్ణమూర్తి 49
సాహితీ వైద్యం – వసుంధర 73
ఉత్తరరచన 83

## కథలు

ప్రేమించి చూడు
– ఇంద్రగంటి నరసింహమూర్తి 19
ఈ నెల ప్రత్యేక బహుమతి పొందిన కథ ...
పూర్ణా నరసింహం – వసుంధర 28
కథాపీఠం కథ ...
కొవ్వొత్తి ప్రవృత్తి – ఐ. రాజ్‌మోహన్ 34
కథాపీఠం కథ ...
ఉసురు – నల్ల భూమయ్య 42
రెండు నాన్నలు – జి.యస్. లక్ష్మి 58
ఆప్షన్ – శ్రీధర 68
సర్వెంట్‌మెయిడ్ డాట్ కామ్
– పాలెపు బుచ్చిరాజు 80
ఆనాటి ఆంధ్ర సచిత్ర వారపత్రిక కథ • అలనాటి కథ బొమ్మలతో...
జేబులూ – గుండీలూ – క్రొవ్విడి లక్ష్మన్న 88

## కార్టూన్లు

జయదేవ్ 87
బాలి అక్కడక్కడక్కడా

వచ్చే సంచికలో కథకులు :
ఎలక్ట్రాన్ : కుంతి : దేవులపల్లి దుర్గాప్రసాద్ : ద్విభాష్యం రాజేశ్వరరావు తదితరులు

ది వ్యూస్, ఒపీనియన్స్ ఎక్స్‌ప్రెస్‌డ్ అండ్ స్టేట్‌మెంట్స్ మేడ్ బై ది రైటర్స్, ఆథర్స్ అండ్ రీడర్స్ నీడ్ నాట్ నెససరిలీ బి దోస్ ఆఫ్ ది ఎడిటర్ అండ్ మేనేజిమెంట్ ఆఫ్ రచన ఇంటింటి పత్రిక. ఆల్ డిస్ప్యూట్స్ విల్ కమ్ అండర్ ది ఎక్స్‌క్లూజివ్ జ్యూరిస్‌డిక్షన్ ఆఫ్ రెస్పెక్టివ్ కోర్ట్స్ అండ్ ఫోరమ్స్ సిట్యుయేటెడ్ ఇన్ హైదరాబాద్ సిటీ ఓన్లీ.

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా




రచయితలచే నిర్వహింపబడుతున్న ఏకైక పత్రిక!


**'రచన' కార్యాలయం**

**చిరునామా**
1-9-286/2/పి : విద్యానగర్
(రాంనగర్ గుండు దగ్గిర)
హైదరాబాద్ -500 044
ఫోన్ : 040 - 2707 1500

*సంపాదకుడు*
**వై. వి. యస్. ఆర్. యస్. తల్పశాయి**
*అసోసియేట్ ఎడిటర్*
'హంసలేఖ'


## సంపాదకీయం

**అష్టవిధ నాయికలు** : శృంగారంలో నాయకీ నాయకులను, వాళ్ల వాళ్ల లక్షణాలనుబట్టి, పండితులు కొన్ని రకాలుగా విభజించారు. ఈ సిద్ధాంతీకరణంలో శృంగార నాయకులు – 'అనుకూలుడు, దక్షిణుడు, ధృష్టుడు, శఠుడు' అని నాలుగు రకాలు మాత్రమే! శృంగార నాయికలు మాత్రం 'అభిసారిక, వియోగిని, వాసకసజ్జిక, విప్రలబ్ధ, ఖండిత, ప్రోషిత భర్తృక, కలహాంతరిత, స్వాధీనపతిక' అని ఎనిమిది రకాలు!!! ఈ శృంగార నాయికల్ని శ్రీ పఠాభి కవితాత్మ వర్ణించగా శ్రీ బాపు మొట్టమొదటి సారిగా వర్ణచిత్రాలను 1967లో కొత్తగా ప్రారంభం అయిన 'సుధ' మాస పత్రిక కోసం రూపొందించారు. 'సుధ' ప్రచురణ కేవలం ఆరు సంచికలకే పరిమితం కావడంతో ఎనిమిదింటికి గాను ఆరు మాత్రమే ప్రచురింపబడ్డాయి. మిగతా రెండు బొమ్మలూ (స్వాధీనపతిక, కలహాంతరిత) అలభ్యాలు. ఆ తర్వాత స్క్రిప్ట్ ఆర్ట్ వారి గ్రీటింగ్ కార్డుల కోసం మరలా అష్టవిధ నాయికలను సరికొత్తగా ఆవిష్కరించారు బాపుగారు. ఈసారి ఆ శృంగార నాయికలకు కవితాత్మ దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. ఈ సంచిక నుంచీ ఆ అష్టవిధ నాయికలను రచనాభిమానులకు అందిస్తున్నాము.

**సరికొత్త సీరియల్ నవలలు** : మన ప్రధానమంత్రి ఆకస్మాత్తుగా నిస్వార్థంగా ఆర్థిక ఎమర్జెన్సీని ప్రకటించినట్లుగా బీనాదేవిగారి 'జస్టిస్ ఫర్ సేల్ : అమ్మకానికి న్యాయం' ఈ సంచికలో అప్రకటితంగా, అకస్మాత్తుగా ప్రారంభిస్తున్నాము. ఆనాడు స్వీయ ప్రయోజనాలకోసం విధించిన ఎమర్జెన్సీ సృష్టించిన ప్రకంపనల వలెనే ఈ నవలా రచనా శైలి కూడా ఉన్నదనుకుంటున్నాము. ఇదివరలో వసుంధరగారు డిటెక్టివ్ వెంకన్న ప్రధాన పాత్రగా చాలా నవలికలు 'అపరాధ పరిశోధన'లో రాసినా పూర్తిస్థాయిలో రాసిన పెద్ద నవల 'గగనానికి ఇలకూ బహుదూరం'. ఈ నవల మకుటంలోనే కాదు రచనావిన్యాసంలోనూ సొంపుని నింపుకుని అలరించగలదనుకుంటున్నాము. ఈ రెండు నవలల్లోని ఒకేఒక్క సారూప్యం పరిశోధనే అయినా దేనికదే విలక్షణ పంథాలో చకచకా సాగిపోతాయి.

**కథల పోటీ** : 'రచన' పాతికేళ్ల ప్రస్థానంలో మొదట్లో హాస్యరస ప్రధానమైన కథల పోటీని, మధ్యకాలంలో ఆహ్లాదకర కథల పోటీని, చివరి సంవత్సరంలో వినోద కథల పోటీని నిర్వహించడం జరిగింది. విజేతలకు బహుమతులు అందించినది కవన శర్మ, యండమూరి వీరేంద్రనాథ్, వసుంధర కుటుంబ సభ్యులు.

**ఉత్తరాలు** : 'రచన' ప్రారంభానికి ముందు వేయిన్నర ఉత్తరాలు వచ్చేయి. ఆ తర్వాత పది పదిహేనేళ్లదాకా అదే ఒరవడి నిరంతరంగా కొనసాగింది. ఆ తరువాత ఇంటర్నెట్, సెల్‌ఫోన్ల వాడకం అంటువ్యాధిలా పెరిగిపోవడంతో ఉత్తరాలు రాయడం దాదాపుగా తగ్గిపోయింది. కానీ మళ్లీ ఇన్నాళ్లకు 'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' ప్రచురణలో భాగస్వామ్యం కోసం ఎన్నో చేతివ్రాత ఉత్తరాలు అందుకోవడం చాలా సంతోషాన్నిచ్చింది. టైం మేనేజిమెంట్ సాధ్యంకాక ఉత్తరాల ద్వారా కాకుండా ఫోన్ చేసి వారు పంపిన చెక్కులు అందినట్లు చెప్పవలసి వచ్చినందుకు సిగ్గిలుతున్నాము.

ఆ ఉత్తరాల్లో 'రజతోత్సవ సంపుటి' మీద రచనాభిమానులు పెట్టుకుంటున్న అంచనాలను తల్చుకుంటే గాభరా కలుగుతోంది కూడానూ!

దాని కోసం అధికంగా, విలక్షణంగా శ్రమించక తప్పదు అన్న ఎరుక కలిగింది. అందుకు ప్రచురణ కొంత ఆలస్యమైనా తప్పులేదన్న నిర్ణయానికి కూడా రాక తప్పలేదు. అందుకే...

ఈ పత్రిక మీది! మీఅభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!



## శ్రీ రాయవరపు వి.ఎస్.ఎస్. సూర్యనారాయణ (1956-2004) షష్ఠ్యబ్ది పూర్తి పురస్కారం

రాయవరపు వి.ఎస్.ఎస్. సూర్యనారాయణని దగ్గరివారు 'సూర్యనారాయణ' అంటారు. బాగా దగ్గరివారు 'వెంకుబాబు' అంటారు. ఇంకా బాగా దగ్గరివారు 'వెంకూ' అంటారు. తెలిసినవారందరూ అతడికి ఎంతోకొంత దగ్గరివారే!

తనకిష్టమైన పని నష్టమైనా కూడా కష్టపడి చేస్తాడు. ఫలితంతో నిమిత్తం లేకుండా సంతృప్తి పడతాడు.

చెడుని కనిపెట్టలేకపోవడంలో అజాతశత్రువు. అవసరానికి ఆదుకొనడంలో మిత్రులకీ, శత్రుభావమున్నవారికీ కూడా ఆత్మబంధువు. కోరికల్లో చిన్ని శిశువు. నిత్యానందంలో నిజమైన సన్యాసి. ప్రవర్తనలో అత్యంత సామాన్యంగా కనిపించే అతిలోకవాసి. విపరీతాన్ని ఉపవీతంగా స్వీకరించిన అరుదైన మనిషి. అందుకేనేమో 2004లో నలభై ఏడేళ్లకే నూరేళ్లు నిండేక ఇప్పుడు షష్టిపూర్తికి వచ్చాడు.

హాస్య, వ్యంగ్య, చమత్కార భాషణలో అతడి సృజన, చురుకుతనం అనన్యసామాన్యం. చిత్రమేమిటంటే అతడు వదిలే నిశిత వ్యంగ్యబాణాలు కూడా ఎదుటివారిని నొప్పించవు సరికదా, మృదు పుష్ప స్పర్శానుభూతితో గిలిగింతలు పెడతాయి.

శ్రీ సూర్యనారాయణ షష్టిపూర్తి సందర్భంగా – అతణ్ణి ఆ స్థాయి రచనలతో అభిషేకించాలనుకున్నాం. అందుకు శ్రీ సూర్యనారాయణతో బంధం, అనుబంధం ఉన్న 'రచన' వేదికపై వినోద కథల పోటీ జయప్రదంగా నిర్వహించబడింది. మా యీ చిన్న ప్రయత్నం సాఫల్యం కావడానికి సహకరించినవారందరికీ ధన్యవాదాలు!

*– జొన్నలగడ్డ (రాయవరపు) రామలక్ష్మి (వెంకు చిన్నక్క)*

*– రాయవరపు ఆదినారాయణరావు (వెంకు తమ్ముడు)*

**'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' విడుదల? :** 2001 సం॥ జూలై నెలలో పది రోజుల పాటు మలేరియాతో కూడిన జాండిస్ బారిన పడడం జరిగింది. ఇంట్లో ఉంటే పనులు చేస్తూనే ఉంటానని మిత్రులు డా॥ చిత్తర్వు మధుగారు ఓ వారం పాటు ఓ నర్సింగ్ హోంలో కట్టి పడేసేరు. ఆ కారణంగా ఆనాటి ఆగస్టు సంచిక 14వ తేదీన పోస్టు చెయ్యాల్సి వచ్చింది. అప్పుడున్న పోస్టల్ అధికారి ఇప్పట్లా ఏ ఇబ్బందీ పెట్టకుండా, కనీసం మెడికల్ సర్టిఫికేట్ కావాలనకుండా, అందుకు అనుమతి ఇచ్చేరు.

ఆ తర్వాతి సంవత్సరాలలో ఏదో రెండు మూడు రోజుల స్వల్ప అస్వస్థత తప్పితే పెద్దగా పడకేసింది లేదు. కానీ పదిహేనేళ్ల తర్వాత అక్టోబరు–నవంబరు నెలల్లో మూడు వారాల పాటు జంటనగరాల్లో విజృంభించిన వైరల్ ఫివర్ బారిన పడడం జరిగింది. దాని ఫలితంగా కలిగిన బలహీనతల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాను.

దీనివల్ల రజతోత్సవ సంపుటి పని రెండు నెలలపాటు అటకెక్కింది. అంతకుముందు నెల రోజులకు పైగా యమా స్పీడుగా సాగిన పని ఇప్పుడు మళ్లీ పట్టాల మీద పరుగులు తీస్తోంది. అయినా ముందు ప్రకటించినట్లు సంక్రాంతికి విడుదల చేయలేనన్నది నిశ్చితం!

మోదీగారు అచ్చే దిన్ కోసం 50 రోజులు గడువు ఇవ్వమని అడిగినట్లు (పోలిక బాలేదు కదూ!) మరో రెండు మూడు నెలల సమయం నాకు నేనే కేటాయించుకుంటున్నాను.

ఈ లోపలనే రజతోత్సవ సంపుటి పని పూర్తిచేయగలననే ఆశాభావంతో ఉన్నాను.

అచ్చుకిచ్చే స్థితికి సంపుటి రూపకల్పన పూర్తికాగానే *'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'* విడుదల తేదీని ఖరాఖండీగా ప్రకటించగలను.

రచనాభిమానులకు కలిగిస్తున్న అసౌకర్యానికి రొడ్డకొట్టుడు పదమైన 'చింతిస్తున్నాము' ఇక్కడ వాడక తప్పడంలేదు మరి!

రచనాభిమానులు ఎప్పటిలా సహృదయంతో *'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'* కోసం మరికొంత కాలం ఓపిక పట్టగలరన్న ఆశా భావంతో....

**296**

# రాయవరపు వి.ఎస్.ఎస్. సూర్యనారాయణ షష్టబ్ది పూర్తి

# వినోద కథల పోటీ ఫలితాలు

*రెండు ప్రథమ బహుమతులు : రు. 5,000/- X 2*

ప్రేమించిచూడు : ఇంద్రగంటి నరసింహమూర్తి

అవార్డు కథ : కుంతి

*రెండు ద్వితీయ బహుమతులు : రు. 3,000/- X 2*

ఆప్షన్ : శ్రీధర

పెళ్లికొడుకు మాయం : దేవులపల్లి దుర్గాప్రసాద్

*రెండు తృతీయ బహుమతులు : రు. 2,000/- X 2*

సర్వెంట్‌మెయిడ్ డాట్ కామ్ : పాలెపు బుచ్చిరాజు

ట్వెంటీ ట్వెంటీ కార్పొరేట్ నర్సింగ్‌హోం : ద్విభాష్యం రాజేశ్వరరావు

## సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలు

1. అద్దం అబద్ధం చెప్పదు : పి.వి.డి.ఎస్. ప్రకాష్
2. అలారం : సింహగిరి
3. ఆ రిస్కెందుకు బావగారూ! : పి.ఎస్. నారాయణ
4. అడవి దారిన : పాలగిరి విశ్వప్రసాద్
5. ఓనమాలు : ద్విభాష్యం రాజేశ్వరరావు
6. పెళ్లిపుస్తకం : శ్రీఉదయిని
7. పాపం కనకారావు : సీతాసత్య
8. మాయాజాలం : తిరుమలశ్రీ
9. శతమొండి ఘటాలు : ఎలక్ట్రాన్
10. మా ఇంటి వంట : ఎన్.కె. నాగేశ్వరరావు
11. సుధాప్రద గుడి : ఎలక్ట్రాన్
12. సాహిత్యం వర్ధిల్లాలి : ఎం. రమేష్‌కుమార్
13. లోగుట్టు : వి. ఛాయాదేవి
14. చిదంబర జాలం : సింహప్రసాద్
15. హామీపత్రం : సీతాసత్య
16. హిట్ హిట్ హుర్రే : ఇంద్రగంటి నరసింహమూర్తి
17. జేబు చిల్లాయనమః : పారుపూడి వెంకట సత్యనారాయణ
18. భోజనప్రియుడు : పి.వి. శేషారత్నం
19. స్కైపులో : బోడపాటి రమేష్
20. జిడ్డుశ్రీ : వియోగి
21. సెల్లు గోల : మొలుగు కమలాకాంత్
22. జీన్స్ : జొన్నలగడ్డ మార్కండేయులు
23. హమ్మో అంతర్జాతీయం : సి. యమున
24. బుస్ : సాయిరాం ఆకుండి

పై కథకులందరికీ అభినందనలు! పోటీలో పాల్గొన్న సాహితీమిత్రులందరికీ ధన్యవాదాలు!
న్యాయనిర్ణేలకు కృతజ్ఞతాభివందనాలు!
బహుమతి పొందిన మూడు కథలను ఈ సంచికలోనూ, మరో మూడు కథలను వచ్చే సంచికలోనూ రచనాభిమానులకు అందిస్తున్నాము. మిగిలిన కథలన్నీ వీలువెంబడి ప్రచురించబడతాయి.
కథల ప్రచురణ గురించి ఎలాంటి వత్తిడీ తేవద్దని కథకులను కోరుతున్నాము.
అలా జరిగిన పక్షంలో ఆ కథల ప్రచురణ నిలిపివేయబడే అవకాశం మెండుగా ఉంటుందని మనవి!

– సంపాదకుడు

# జస్టిస్ ఫర్ సేల్

## (అమ్మకానికి న్యాయం)

### బీనాదేవి



## రచయిత్రి సరికొత్త సీరియల్ నవల ప్రారంభం

**ప**ట్నానికీ పల్లెకీ మధ్య మూడు కోసులు దూరం ఉంటుంది.

ఒకానొకప్పుడు ఆ ప్రాంతం ఊరు చివర.

ఆ ఒకానొకప్పుడు బ్రిటిషువాళ్ళు పల్లెనీ, పట్నాన్నీ కలుపుతూ రోడ్డు వేశారు.

ప్రతి మనిషికీ, ప్రతి ఊరుకీ ఓ చరిత్ర ఉంటుంది.

గుడికీ, గోపురానికీ అయితే స్థలపురాణం ఉంటుంది. అలాగే ఆ రోడ్డుకీ ఓ చరిత్ర ఉంది.

ఆ రోడ్డు వేయించిన ఇంజనీరు ఓ బ్రిటిష్ దొర.

ఆ దొర పగలు స్వదేశాభిమాని.

పక్కా బ్రిటిషు పౌరుడు.

రాత్రి ప్రపంచ పౌరుడు.

చీకటి పడగానే అతనికి పండితుల భాషతో మదిర, మదవతి కావాలి.

పామరుల భాషతో మందు, మగువ కావాలి.

అతనికి విస్కీ ఎంత ఇష్టమో, విప్పసారా కూడా అంతే ఇష్టం.

మదవతుల విషయంలో కూడా అతనికి స్వదేశీ, విదేశీ పక్షపాతం లేదు.

దొరసాని అయితే 'తెలుపు ప్యూరిటీకి గుర్తు' అంటాడు.

నలుపుది అయితే 'బ్లాక్ ఈజ్ ఎ లైవ్ కలర్ విత్ విగర్' అనేవాడు.

అతనికి....

దొరసాన్లు పున్నమి రాత్రి వెన్నెలనీ, దొమ్మరిసాన్లు అమావాస్య చీకటి తళుకుల్నీ గుర్తు చేస్తారు.

రాజుకి మంత్రి ఎంత అవసరమో, ఇంజనీరుకి ఓవర్సీరు అంత అవసరం.

ఆ దొర దగ్గర ఒక ఓవర్సీరు ఉన్నాడు.

పేరు కృష్ణావతారం.

ప్రభుభక్తి పరాయణుడు.

దొరల ప్రాపకం సంపాదించడానికి కావలసిన తెలివి కలవాడు.

అందుకే ఏడుగురు సీనియర్లని తప్పించి అతనికి ప్రమోషను ఇప్పించేడు దొర.

ఆ రోజుల్లో ధర్నాలు వగైరాలు లేవు. ఉన్న ఉద్యోగం ఊడకుండా ఉంటే చాలు అనుకునే రోజులు.

బ్రిడ్జిలు, బిల్డింగులు కట్టించడం, రోడ్లు వేయించడం లాంటివన్నీ ఓవర్సీర్ల సాయంతో ఇంజనీర్లే చేసేవారు.

ప్రభుత్వం డబ్బు ప్రభుత్వాధికారులే తినేసేవారు.

బ్రోకర్లు, పెర్సంటేజిలు లేవు.

ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఎంత తిన్నా పన్లు మాత్రం పకడ్బందీగానే చేసేవారు.

ఆనాడు వాళ్ళు కట్టిన బిల్డింగులే ఇప్పుడు మనం కలక్ట

(మిగతా పత్రికలో చదవండి)

# కిరణ్ ప్రభ చిటారుకొమ్మ చిరునామా

అముద్రిత (2006) కవితా సంపుటి ( కవితా సంపుటి)

రేఖా-చిత్రం



## తిరిగిరాని రోజులు

**అ**మ్మ చెప్పిన కథలన్నీ
నడి రాతిరి నిద్దురలో కలలైన రోజులు,
రూపులేని ఊహలన్నీ
సీతాకోకచిలుకలై నాతో విహరించిన రోజులు,
నా బోసి నవ్వులు
ఇల్లంతా పువ్వుల జల్లులు కురిపించిన రోజులు,
తప్పటడుగుల కోసం
నాన్న నన్ను కవ్వించిన రోజులు,
వచ్చీ రాని నా మాటల కోసం
వీధంతా మళ్ళీ మళ్ళీ పిలిచిన రోజులు...
మళ్ళీ రావని తెలిసీ
తిరిగొస్తే బావుండుననిపించే ఆ రోజులు
నాతో బ్రతుకంతా నడిచొచ్చే నిజమైన నేస్తాలు...!!

*(అగస్ట్ 2000)*

రాయవరపు వి.ఎస్.ఎస్. సూర్యనారాయణ షష్ఠబ్ది పూర్తి
వినోద కథల పోటీలో ప్రథమ బహుమతి (` 5,000/-) పొందిన కథ

# ప్రేమించిచూడు....

కాలేజీలో అడుగు పెడుతున్న అమ్మాయిల్ని దూరం నుండే పరిశీలనగా చూస్తున్నాడు బి.టెక్.. మూడో సంవత్సరం విద్యార్థి బ్రహ్మానందం.

ఒక పూబోణి దగ్గరగా వస్తూంటే ఆమెని 'ప్రేమించేద్దాం' అనుకున్నాడు.

"గుడ్ మార్నింగ్... అన్నయ్యా" అంటూ చెయ్యి ఊపింది లతాంగి.

"హుఁ... అన్నయ్యట... కనపడిన మగాడిని అన్నయ్య అని వరస కలపడం ఈ కాలం అమ్మాయిలకు ఫ్యాషనైపోయింది" – నిట్టూర్చాడు బ్రహ్మచారి.

మరో సుందరి 'హాయ్' అంటూ బ్రహ్మి ముందునుండే వెళ్లిపోయింది.

దూరం నుండి వయ్యారంగా నడిచివస్తున్న మరో ఇంతి బ్రహ్మానందాన్ని ఆకర్షించింది.

ఆ అమ్మాయి దగ్గరగా వచ్చాక బ్రహ్మానందం మనసులో ప్రకంపనలు...

'ఎస్... నేను వేచి చూస్తున్నది ఈ రమణి కోసమే... మొదటి చూపులోనే ప్రేమ పుట్టింది. క్షణమైనా ఆలస్యం చేయకుండా అమ్మాయికి నా ప్రేమ తెలియజేయాలి' అనుకుంటూ ముద్దుగుమ్మ ముందు నిలబడ్డాడు. గొంతు తడారిపోయింది..

"నేను... మీరు... ప్రేమ... ప్రేమ" అన్నాడు తడబడుతూ.

"నా పేరు ప్రేమ కాదు... సుహాసిని" – చిరునవ్వుతో చెప్పింది చెలువ.

"అబ్బే... నేనడిగింది పేరు కాదు. ప్రేమ... అంటే నేనీ క్షణం నుండి మిమ్మల్ని ప్రేమిస్తున్నానన్నమాట. మీరూ నన్ను ప్రేమించాలి... అదన్నమాట సంగతి" – చెప్పాడు, బ్రహ్మానందం గొంతు సవరించుకుని.

క్రీగంట చూసింది కలువకంటి.

"ప్రేమించడమంటే...?" – అడిగింది.

"ప్రేమించడం అంటే... ప్రే... మిం... చ... డం..." – ఏం చెప్పాలో తెలియక గుటకలు మ్రింగాడు బి.టెక్., స్టూడెంట్.

"అంటే... మీకు తెలియదా" – నవ్వింది సుహాసిని.

"తెలియదని కాదు... అలాగని పూర్తిగా తెలుసని కాదు..." – దిక్కులు చూశాడు బ్రహ్మం.

"పోనీ నేనిప్పుడేం చేయాలో చెప్పండి" – అడిగింది అమ్మాయి.

"కుదిరితే కప్పు కాఫీ" అన్నాడు ముఖంలో నవ్వు పులుపుకుని కాస్త ఆలోచించి.

"ఓస్ అంతే కదా... సాయంత్రం కాలేజీ అయ్యాక..." అంటూ అతివ వయ్యారంగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

"యాహూ!" – గట్టిగా అరిచాడు బ్రహ్మం.

సాయంత్రం... సుహాసినిని బైకు మీద ఎక్కించుకుని రివ్వున దూసుకుపోయి కాకా హోటల్ ముందు ఆపాడు

(మిగతా పత్రికలో చదవండి)

ఇంద్రగంటి నరసింహమూర్తి

ఆనాడు పెద్దబాబూ, చిన్నబాబూ నన్ను తరిమేసి ఉండక పోతే, ఈ జ్ఞానం నాకు కలిగి ఉండకపోను!

అందుకే చివరి రోజుల్లో వాళ్ళకీ యథోచితంగా జీవనో పాధి కల్పించాను.

అదే వారి పట్ల నా కృతజ్ఞత అనుకున్నాను.

అంతే కాదు...

చిన్నతనంలో వాళ్ళు నా పట్ల ఎలా ప్రవర్తించినా, వాళ్ళ హృదయాలు మంచివి. ప్రభాకర్రావు వల్ల తెలుసుకున్నాను, ఈ సంగతి.

జీవితంలో దుర్ఘటనలు ప్రాప్తం అవడంతోటే, పెద్దబాబు నన్ను తలుచుకుని ఎంతో పరితపించేవాట్ట!

*భవతు!*

కాని, యాచించిన కొద్దీ తెలుసుకోశక్యంగాని విషయం ఒకటి తటస్థం అవుతోంది.

సంపన్న గృహస్థులు వాళ్ళు...

ధనవిహీనులవడం ఏఁమిటి?

విద్యాసంపన్నుడు పెద్దబాబు...

అతని కొడుకులకి చదువు అబ్బకపోవడం ఏఁమిటి?

ఏ చదువూ లేని నాకు అపారం అయిన ఈ లక్ష్మీ కటాక్షం ఎలాగ కలిగింది?

సత్సంకల్పంతో చేసిన నా చర్యలకి అపార్థాలెందుకు వచ్చిపడ్డాయి?

ఇంతాచేస్తే ఈ ధనం నాదా?

అది ఆర్జించడం కోసం కాకుల్ని కొట్టి గద్దలకి వేసాను. తరవాత దాన్ని ప్రజల కోసం వినియోగించాను.

అయినా నీలాపనిందలు తప్పలేదు.

అదుగో... ఆ అవస్థలో బాబావారి గురించి విన్నాను. వారి ఉపన్యాసాలు చదివాను.

అయినా, నా అహంకారం పోలేదు.

మొన్న పుట్టపర్తిలో ఏదో దుకాణంలో వారి బొమ్మ చూస్తూ ఉంటే అనిపించింది.

'ఆయన దేఁవుడే అయితే ఈ నరరూపం ఎందుకు? భౌతిక వాసనలతో నిండిన ఈ మనుష్యుల మధ్య సంచరిం చడం ఎందుకు? తలొక విధంగా వారిని లోకం విమర్శిస్తూ ఉంటే వాటి అన్నిటికీ గురికావడం ఎందుకూ?' అని.

అలా అనుకుంటూ ఉంటే ఆ బొమ్మలో శ్రీవారి ముఖం మందహాసం చేసినట్టనిపించింది. ఈ మాత్రం తెలుసుకో లేవా అన్నట్టుందా చిరునవ్వు!

నాటి సాయంకాలం ఉపన్యాసంలో బాబావారి నోటనే లభించింది, నా సందేహ నివృత్తి.

ఆయన ధారావాహికంగా భక్తి మార్గం ఉపదేశిస్తూ అన్నారు – నీళ్ళలోకి దూకాలని!

అంతకుముందు ఎంతోమంది అనగా విన్నాను, మనకి ఏఁదైనా సందేహాలుంటే, వారి ఉపాన్యాసాలలోనే అవి తీరిపోతాయని.

అది నేనా నాడు ప్రత్యక్షంగా అనుభవించాను.

ఒళ్ళు పరవశం చెందిపోయింది.

వారి సమక్షంలో చెప్పనలవికాని ప్రశాంతి!

అందుకే వారి శరణుజొచ్చాను.

ప్రశాంతి నిలయంలోనే ఉండిపోయాను.

నా వృత్తాంతం అంతా మీ ముందు ఉంచాను.

దగుల్బాజీలంతా... ఇలాగ రంగు మార్చిన వాళ్ళే అంటారా?

వృద్ధనారీ పతివ్రతా అని ఎత్తి పొడుస్తారా?

*'ఎంత పనికిమాలినవాడు ఈ మనిషీ!'* అని ఏవగించు కుంటారా?

లేదా, ఎప్పుడో ఒకప్పుడు మనిషికి మనః పరివర్తనం కలుగుతుందని సద్భావం కనబరుస్తారా?

మీ ఇష్టం!

మీరేఁమనుకున్నాసరే....

నా జీవిత చరిత్ర యిదీ!

యథాతథంగా రాసి మీ ముందు ఉంచుతున్నాను.

*ఆత్మసాక్షిగా చెబుతున్నాను నమ్మండి, నమ్మకపోండి!*

*(సమాప్తం)*

# పూర్ణ నరసింహం

ఈ పెద్దోళ్లున్నారే –

వాళ్లు పిల్లలు తమకి పేరు తేవాలనుకోవడం వరకూ బాగానే ఉంది. కానీ పిల్లలకి పేర్లు పెట్టేముందు ఆ విషయం ఆలోచించాలన్న ఇంగితజ్ఞానం ఉండాలి కదా!

ఉదాహరణకి మా తాతగారు. ఆయన పేరు ఆదిరాజు నరసింహం. బామ్మ పూర్ణకళ. వాళ్ల పేర్లు చక్కగా ఉన్నాయి కదా! కానీ తమకి ఐదుగురు ఆడపిల్లల తర్వాత లేకలేక పుట్టిన మగపిల్లాడని – నాన్నకి అప్పారావని పేరు పెట్టారు – సాహిత్యంలో గురజాడ అప్పారావు అంతటి పేరు తెచ్చుకోవాలని!

అప్పారావు పేరు పెట్టుకున్నవాళ్లందరూ రచయితలై పోవాలంటే – సారా కథలు రాచకొండ అప్పారావు, వంటొచ్చిన మగాడు భమిడిపాటి అప్పారావు, బుడుగు కథ ముళ్లపూడి అప్పారావు, మిథునం కథ శ్రీఅప్పారావు – రాసి ఉండాలి. ఇంతకీ గురజాడ వారి గిరీశాన్ని అమరం చేసిన ముళ్లపూడి వారు అప్పారావు పేరుని (అప)హాస్యానికి అప్పు తెచ్చుకుని మరీ వాడుకున్నారు.

నేను గురజాడ వీరాభిమానిని. సింహాద్రి అప్పన్న వీర భక్తుణ్ణి. గురజాడ పక్కన అప్పారావు పేరు బంగారు ఉంగరానికి తాపడం చేసిన వజ్రంలా ధగధగ మెరిసిపోతుందనుకుంటాను. కానీ అబద్ధమెందుకూ – ఆదిరాజు పక్కన అప్పారావు పేరు నాకు నచ్చలేదు. అప్లికేషన్లలో తండ్రి పేరు వ్రాసినప్పుడల్లా నా మనసు కలుక్కుమనేది.

కొందరికి పేరుకి మించిన గొప్పతనం ఉంటుంది. అలాంటివాళ్లు, పేరులో ఏముందనుకోవచ్చు. కానీ – ఏ గొప్పతనం లేనివాళ్లకి పేరులోనే అంతా ఉంది. ఈ రోజుల్లో ఆడపిల్లల్నే తీసుకోండి. అబ్బాయిలకి ఏ అప్పన్నో, పుల్లన్నో అని పేరుందనుకోండి. ఆ అబ్బాయి – అమెరికాలో గ్రీన్ కార్డ్ హోల్డరైనా సరే – వాళ్లతణ్ణి పెళ్లి చేసుకోరు కాక చేసుకోరు. అమ్మాయిలకి అప్పలమ్మ, పుల్లమ్మ లాంటి పేర్లున్నాయనుకోండి. అప్పుడు అబ్బాయిల రెస్పాన్సూ సేమ్ టు సేమ్.

అప్పారావు పేరు నాన్నని బాగా ఇబ్బంది పెట్టే ఉండాలి. ఐనా దాన్నించి ఆయన నేర్చుకున్నదేం లేదు. పైగా తనకి ఆ పేరెట్టిన తాతగారికీ, బామ్మకీ నా పేరు పెట్టే బాధ్యత కూడా అప్పగించాడు. ఐనా అంత ఇబ్బంది ఉండేది కాదేమో. కానీ నాన్న తీసుకున్న మరో నిర్ణయం నన్ను ముంచింది.

నాన్నకి గురజాడ వారి రచనా సామర్థ్యం లేదు.

కానీ 'దేశమును ప్రేమించుమన్నా' అన్న వారి ప్రబోధం బాగా తలకెక్కింది.

మన దేశానికున్న ముఖ్య సమస్య జనాభా అని నాన్న నమ్ముతాడు. 'వట్టి మాటలు కట్టిపెట్టి గట్టి మేల్ తలపెట్టవోయ్' అనుకుంటూ– ఆడైనా, మగైనా ఒక్క బిడ్డకి మాత్రమే జన్మనివ్వాలని మహా గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఆ విషయం తాతగారు, బామ్మలకి కూడా చెప్పి ఒప్పించగలిగాడు.

నాన్నకి అప్పారావు పేరెట్టాక – అటు అప్పారావుకీ, ఇటు మా వంశానికీ ఒరిగినదేంలేదని తెలిపోయిందిగా. దాంతో నా విషయంలో – పేరు తేవడం కాదు, పేరు నిలబెట్టడం ముఖ్యం అనుకున్నారు తాతగారు, బామ్మ.

ఇంతకీ నిలబెట్టాల్సిన పేర్లు తాతవీ, బామ్మవీనూ. పుట్టింది ఆడపిల్లైతే బామ్మ పేరనీ, మగ పిల్లాడైతే తన పేరనీ – తాతగారు ప్రతిపాదించారు. దానికి బామ్మ ఒప్పుకోలేదు. 'నా దృష్టిలో వంశాంకురం అంటే మగపిల్లాడు మాత్రమే. మనవాడికి మగనలుసు పుట్టాలని పూజలు చేస్తాను. నోములు నోస్తాను. అందులోనూ నేను మహా పతివ్రతని. మహా భక్తురాల్ని. ఇంకా ఏమేమో మహాని. కాబట్టి దేవుడు నా కోరిక తప్పక మన్నిస్తాడు. మనకి మనుమడే పుడతాడు. వాడు నా పూజల ఫలం కాబట్టి వాడికి నా పేరే పెట్టాలి" అంది.

బామ్మ భక్తికి పూర్వకాలం మనిషే కావచ్చు. కానీ, స్త్రీ

వాదానికి మాటల్లో ఏ ఒల్గాకీ తీసిపోదు. ఆమె మాటలకి ఒప్పుకోవడంలో తాతయ్యకీ సుఖముంది. మరి ఇంట్లో ఆయన పనులు ఇంకా చాలావరకూ ఆవిడే చేస్తోంది. నల్ల ధనాన్ని వెనక్కి తేనక్కర్లేనంత కాలం – అవినీతిని నిరసించ డానికి తనకేం అభ్యంతరంలేదనే మన్‌మోహన్‌లా – ఆయన బామ్మ స్త్రీవాదానికి మద్దతు ఇస్తాడు.

“మనవడికి నీ పేరు పెట్టడం న్యాయం. కానీ నువ్వు మహాపతివ్రతవి కదా – ఎప్పుడూ నీ పక్కన నేనున్నట్లే నీ పేరు పక్కన నా పేరూ ఉంటుంది” అంటూ ముందరి కాళ్లకి బంధం వేశాడు తాతగారు.

అలా నాకు పూర్ణ నరసింహం అన్న పేరు వచ్చింది, పూర్తిగా నరుడూ సింహం కాని నరసింహం, పూర్ణ నర సింహం ఏమిటని బారసాలకొచ్చిన ఓ సాహితీ విమర్శకుడు తిరకాసు పెట్టాట్ట.

దానికి మా తాతగారు – “నీ మనవడికి వీరవెంకట సత్యసుబ్బ ఆంజనేయ వరప్రసాద సాయి – అని పేరెట్టావు కదా – దాన్ని టీకాతాత్పర్యంతో సమర్థించు. నేను నీకు సమాధానం చెబుతాను” అన్నాట్ట.

తిరగబడ్డ ఆ గురివింద గింజని చూసి అక్కడున్న వాళ్లంతా నవ్వారుట.

వాళ్లలా నవ్వకపోయినా బాగుండేది – నా పేరు మారేది. మున్ముందు ఆ పేరు ద్వారా నేను నవ్వులపాలు కాకుండా కాపాడేది!

ఇంట్లో అంతా నన్ను పూర్ణా అనేవారు. ముద్దుగా ‘ఏమే’ అనేవారు కూడా.

నాకు ఏడాదిలోపులోనే పుట్టువెంట్రుకలు తీయించినా – ఆ తర్వాత నాలుగేళ్లొచ్చేదాకా నా తలమీద కత్తెర పడ నివ్వలేదు మావాళ్లు. అమ్మ నాకు తల నున్నగా దువ్వి జడే సేది. బొట్టు, కాటుక పెట్టేది. పరికిణి, జాకెట్ తొడిగేది. చూసినవాళ్లు నన్ను ఆడపిల్ల అనుకునేవారు.

నేను కూడా ఆ మాయలో పడి – చిన్నప్పుడు, “నేనొక్క ద్దాన్నీ ఆడుకుంటా” అనేవాణ్ణిట.

“ఎంతైనా ఇంట్లో ఆడపిల్లుంటే ఆ అందమే వేరు” అని బామ్మ నిట్టూర్చేది. అలా అన్నవాళ్లు ఆడపిల్ల కావాలని కోరుకోవచ్చుగా – ఊహుఁ! పదవిలో ఉంటే హైటెక్కులు. లేనప్పుడు రైతులు. ఇంటా బయటా అంతా రాజకీయమే మన దేశంలో!

నాది బామ్మ పేరని సంబరపడేవాణ్ణి కానీ – స్కూల్లో చేరేదాకా అది ఆడపిల్ల పేరని నాకు తట్టలేదు. మగపిల్లలు నన్ను ‘ఏమే’ అని పిలిచి వేళాకోళం చేసేవారు. ఆడపిల్లలు నా పేరు విని ముసిముసిగా నవ్వుకునేవారు. దాంతో నేను నా పేరుని ఎపి నరసింహంగా మార్పించుకుని స్కూలు మారిపోయాను. అలా బయట కొంత ఇబ్బంది తప్పింది తాత్కాలికంగా. ఇంట్లో మాత్రం పూర్ణ పేరు కొనసాగుతూ ఇబ్బంది పెడుతూనే ఉంది.

బామ్మకి నేనంటే చాలా ఇష్టం. మా పూర్ణ ఇలా, మా పూర్ణ అలా అని అందరికీ నా గురించి గొప్పగా ఏమేమో చెబుతూండేది. ఆ వినేవాళ్లు అబ్బాయిలైతే – పూర్ణంటే అమ్మాయనుకుని నన్ను కలవడానికి ఏదో వంక పెట్టుకుని వచ్చేవాళ్లు. కలిశాక వాళ్ల ముఖాలు ఏదోలాగైపోయేవి.

నేను టెన్తు క్లాసులో ఉండగా జరిగిన అలాంటి అనుభవ మొకటి ఇప్పటికీ మర్చిపోలేను.

ఒకసారి బామ్మ గుడికి వెళ్లింది. అక్కడ ఓ ఇంజనీరింగు స్టూడెంటు పరిచయమయ్యాడు. బామ్మ అతడికి మా పూర్ణ ఇలా, మా పూర్ణ అలా అంటూ చెప్పేసరికి నా గురించి ఏమేమో ఊహించుకుని తెగ ఇంప్రెసైపోయాడు. నేను టెన్తు చదువుతున్నాననీ, నాకు లెక్కల్లో హెల్పు కావాలనీ తెలుసుకుని – నాకు సాయపడాలని తెగ ఆత్ర పడిపోతూ ఒక ఆదివారం ప్రత్యేకంగా మా ఇంటికొచ్చాడు.

తీరా చూస్తే బామ్మ నన్ను పరిచయం చేసింది. దాంతో అతగాడి ముఖం ఏదోలాగై పోయింది. పుస్తకాలు చూస్తానని వంకపెట్టి నా గదిలో కొచ్చాడు. నేను చాలా ఉత్సాహంగా పుస్తకాలు తియ్యబోతే, “అవేం చూడక్కర్లేదులే కానీ, మీ బామ్మకి చెప్పు – నిన్ను పూర్ణ అని కాక పున్నయ్య అని పిలవమని” అన్నాడు.

“నా పేరుతో నీకేం ఇబ్బంది?” అన్నాను తెల్లబోయి.

“ఎవరో మీ ఇంట్లో కత్రీనా కైఫ్ ఉందని చెప్పారనుకో. మీ ఇంటికొస్తే మీ బామ్మ పేరు కత్రీనా అని తెలిసిందనుకో. అది నాకిబ్బంది కాదూ!” అన్నాడతడు.

*(మిగతా పత్రికలో చదవండి)*

**వసుంధర**




## సరికొత్త సీరియల్ నవల ప్రారంభం

**సెప్టెంబర్ 8 2014**
**ఉదయం 9 గంటలు**

'శ్రీ కల్యాణి' నాలుగంతస్తుల భవనం.

ప్రతి అంతస్తులో మూడువేల చదరపు అడుగులతో ఒకే ఇల్లు. ఆ ఇంటి ఓనరే ఆ అంతస్తు ఓనరు కూడా.

ప్రతి ఇల్లూ – నాలుగు పడకగదులతో విశాలంగా ఉంటుంది. సకల సదుపాయాలతో అత్యాధునికంగా ఉంటుంది. నిపుణుల ఇంటీరియర్ డెకరేషన్‌తో మనోహరంగా ఉంటుంది.

ఇంటి యజమానులు నలుగురికీ, కింద పార్కింగ్ స్పేస్‌తో విశాలమైన సెల్లార్ ఉంది.

అందులోనే ఒక మూలగా రెండు గదుల ఇంట్లో వాచ్‌మన్, అతడి భార్య, ఇద్దరు పిల్లలు ఉంటున్నారు.

వాచ్‌మన్ భార్య ఆ నాలుగిళ్లలోనూ పని చేస్తుంది. పని చెయ్యనప్పుడు ఆమె వేషధారణ చూసినప్పుడు, ఆమె కూడా ఆ ఇంటి యజమాని అనిపించేలా ఉంటుంది.

వాచ్‌మన్ పిల్లలు ఇంగ్లీషు మీడియం స్కూల్లో చదువుతున్నారు. స్కూల్ యూనిఫాంలోనే కాక, ఉత్తప్పుడూ చూడ్డానికి మధ్యతరగతికి కాస్త ఎగువనే ఉన్నారనిపిస్తుంది.

వాచ్‌మన్ ఆ నాలుగిళ్లకీ బట్టలు ఇస్త్రీ చేస్తాడు. చూడ్డానికి అన్ని వేళల్లోనూ కూడా వాచ్‌మన్‌లాగే ఉంటాడు.

కిందినుంచి పై అంతస్తులు చేరుకోవడానికి లిఫ్ట్ ఉంది.

ఆ లిఫ్ట్ ఆపరేషన్ డ్యూటీ కూడా వాచ్‌మన్‌దే.

అందరిదీ ఒకే భవనమైనా, ఒక అంతస్తువారింకో అంతస్తువారితో మాట్లాడే సందర్భాలు అరుదు. రోజూ అన్ని అంతస్తులవారితోనూ మాట్లాడేది వాచ్‌మన్ ఒక్కడే.

అన్నింట్లోకీ క్రింది అంతస్తు విశేష్‌ది.

అతడు ఊళ్లో లేడు.

ఇంట్లో విశేష్ భార్య జలజ ఒంటరిగా ఉంది.

మామూలుగా ఐతే ఆరు లోపే నిద్ర లేస్తుంది. కానీ ఈ రోజు మాత్రం తొమ్మిదికి మంచంమీంచి లేచింది.

ఆమె ఆవులిస్తూ వళ్లు విరుచుకోవడంతో ఈ కథ మొదలౌతోంది.

ముందు రాత్రి టివిలో ఒంటిగంట దాకా, యూట్యూబులో 'హేట్ స్టోరీ' హిందీ మూవీ చూసిందామె.

ఆమెకా సినిమా ఇష్టం.

అందులో పావోలీ జర్నలిస్టు. తన బాయ్‌ఫ్రెండ్ నిఖిల్ ద్వివేదితో కలిసి – ప్రముఖ వ్యాపారవేత్త కుమారుడైన గుల్షన్ మీద నిఘా పెట్టి, అతడి వ్యాపారంలో జరుగుతున్న అక్రమాల్ని బయట పెడుతుంది. గుల్షన్ ముందామెతో స్నేహం చేసుకుని, తర్వాత ప్రేమ పేరిట వంచించి, దారుణంగా అవమానిస్తాడు.

పావోలీ కృంగిపోదు. తనువునే అస్త్రంగా వాడి ముందు గుల్షన్ అనుయాయుల్నీ, తర్వాత అతడికి అనుకూలుర్నీ లొంగదీసుకుని – క్రమంగా అతణ్ణి సర్వనాశనం చేస్తుంది.

ప్రేమలో వంచనకు గురైన ఆడది దెబ్బతిన్న పులిలా ఎలా హుంకరించగలదో, అవమానానికి గురైన ఆడది చాణక్యుడిలా ఎలా పథకాలు వెయ్యగలదో – ఆ హావభావాల్ని అద్భుతంగా ప్రదర్శించింది పావోలీ.

'హేట్ స్టోరీ'ని భర్తతో కలిసి చూడాలని జలజకి సరదా. విశేష్ ఒప్పుకోడు. ఆడది తనువును అస్త్రంగా ఎలా వాడగలదో చూపడానికే ఆ చిత్రం తీశారని అతడంటాడు. చూస్తుంటే భార్య పక్కనున్నా కూడా, మనసు పావోలీ మీదకే పోతుందనీ – అది తనకిష్టముండదనీ అతడంటాడు.

ఆడది మగాడి వంచనను భరించాలే తప్ప, ఎదురుతిరగకూడదనుకోవడం పురుషాహంకారం. అది భర్తకుందని జలజ అనుమానం. జలజతో కలిసి ఆ సినిమా చూస్తే అతడు కూడా జలజలాగే స్పందించాల్సి ఉంటుంది. తనొక్కడూ విడిగా చూస్తే పావోలీ మీద మరింత కాంక్ష పెంచుకోవచ్చు.

అందుకే అతడు తనతో ఆ చిత్రం చూడడని జలజ అనుకుంటుంది.

ఏదేమైనా రాత్రి ఆ సినిమా చూసేక ఆమెకి వళ్లు వేడెక్కింది. మనసు భర్త మీదకి పోయింది. ఓ పట్టాన నిద్ర పట్టలేదు. పట్టేక ఆ నిద్రలో రకరకాల కలలు. వాటిలో కాలేజి రోజులు. అప్పటి పరిచయాలు.

అలా మర్నాడామె నిద్ర లేచేసరికి ఆలస్యమైంది. భర్త లేడు కాబట్టి ఎంత ఆలస్యంగా లేచినా ఫరవాలేదు. తనకి ఆకలేస్తే తప్ప టిఫిన్ చేసుకోనక్కర్లేదు.

జలజ బ్రష్ చేసుకుని కాఫీ కలుపుకుని తాగింది. రాత్రి కలలు ఆమెలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

తెలిసీ తెలియని వయసులో, వదిలీ వదలని ఆకర్షణలు. అవప్పుడే మర్చిపోయా ననుకుంది. కానీ కలల్లో స్పష్టంగా, అన్నీ నిన్నే జరిగినట్టుంది. వాస్తవాలే ఐనా వాటిలో అటూ ఇటూ కూడా వంచన లేదు. హేట్‌స్టోరీకి అవకాశమే లేదు. అందుకే ఆ జ్ఞాపకాలు ఎంతో మధురం.

జలజ స్నానానికి లేచింది. ఇంట్లో ఉన్నది తానొక్కతే కాబట్టి, సంకోచం లేకుండా బట్టలు హాల్లోనే విప్పింది. బెడ్రూంకెళ్లి వాటిని లాండ్రీ బాక్స్‌లో వేసి, అటాచ్డ్ బాత్రూం తలుపు తెరిచింది. లోపలి కెళ్లింది కానీ మూయ్యలేదు.

షవరు విప్పింది. నీళ్లు వేడిగా లేవు.

వేణ్ణీళ్ల అవసరమూ లేదు.

చల్లని నీటి స్పర్శ ఉత్సాహాన్ని మరింత ఉరకలు వేయించి పాట అందుకుంది :

*'మనోహరా నా హృదయమునే ఓ మధువనిగా మలిచినావంట, రతీవరా ఆ తేనెలనే ఓ తుమ్మెదవై తాగిపొమ్మంట...'*

అప్పుడామె మనసులో ఏ మనోహరుడూ లేడు.

వానలో ఆడుకునే పసిపాపలా షవరు కింద చేతులాడిస్తూ పరవశంగా నెమ్మదిగా పాడుతోంది.

గానగంధర్వుడు బాలసుబ్రహ్మణ్యం శ్రుతి శుద్ధంగా లేదనొచ్చు. షవరు శబ్దానికి లయబద్ధంగా ఉండకపోవచ్చు. కానీ గొంతు మాత్రం మధురం. అందులో తడిసి తియ్యబడిన రాగధారలు వీనుల విందు. ఆమె వంటిమీద పడి బంగారు దారాల్లా మెరుస్తున్న నీటిధారలు కనులవిందు.

అప్పటికా విందులా ఇంటి గోడలకే పరిమితం. వాటికి మాత్రం ఆ భాగ్యమెందుకు దక్కనివ్వాలీ అన్న అసూయతో కాబోలు –

*'మగాళ్లు ఒట్టి మాయగాళ్లు, ప్రేమంటే ఏమిటో తెలీదే, నట్టేట్లో ముంచేసి పోతారే, ఈడు కూడ ఇంతే....'* అంటూ గీతమాధురి స్వరం – బెడ్రూంలోంచీ తెరిచి ఉన్న బాత్రూం తలుపుని దాటుకునొచ్చి, జలజ గొంతునీ, షవర్ శబ్దాన్నీ మించి – శ్రుతి, లయబద్ధంగా వినబడింది.

అదామె మొబైల్ రింగ్‌టోన్. తనకిష్టమై పెట్టుకోలేదు. అపరిచితుల్నించి ఆమెకొచ్చే కాల్స్ కోసం, ఆమె భర్త విశేష్ ప్రత్యేకంగా డౌన్‌లోడ్ చేసిన రింగ్‌టోన్ అది.

పాట ఆగింది. షవరూ ఆగింది. 'ఇప్పుడెవరిదీ ఫోను?' అనుకుంటూ షవర్ క్యాప్ తీసి, పక్కన్న వాల్‌హేంగర్‌కి తగిలించిన టవలు తీసుకుని హడావుడిగా వళ్లు తుడుచు

*(మిగతా పత్రికలో చదవండి)*

# ఉత్తర రచన

1991 డిసెంబరు సంచిక 160 పేజీలతో, పది రూపాయల సాధారణ ధరతో బాపుగారి ముఖచిత్రంతో *'ప్రారంభ (దీపావళి) ప్రత్యేక సంచిక'* గృహ గ్రంథాలయంలో ఇంకా భద్రంగా ఉంది. ఆనాడు నాకు పద్దెనిమిదేళ్ళ వయసప్పుడు మిత్రుడు అడబాల సూర్యనారాయణతో కలిసి తుని రైల్వేస్టేషను బుక్‌షాపులో *'రచన ప్రారంభ (దీపావళి) సంచిక'* కొని ఇంటికి తెచ్చుకొని మేడమీద గదిలో మిత్రులమంతా కలిసి చదువుకున్న సాహితీ పిపాస ఇప్పటికీ కళ్ళముందు సజీవంగా ఉంది.

నాటి నుండి నేటివరకు జన్మదిన సంచిక మాత్రమే కాదు ప్రతీ సంచిక ప్రత్యేక సంచికగా అందరినీ అలరిస్తున్న 'రచన'కు లక్షలాది హార్థికాభివందనాలు. శతకోటి అభివందనలు.

*– అనపర్తి సీతారామ్ (విశాఖపట్నం)*

*(మీ జ్ఞాపకశక్తికీ, అభిమానానికీ అబ్బురపడుతున్నాను. – సం॥)*

మన *'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'* ప్రకటన చూసిన తర్వాత చాలా సంతోషించాను. ఒక రచనాభిమానిగా, రచయిత్రిగా, చందాదారుగా *'రచన కుటుంబ'* సభ్యురాలిగా నా ఉడుతా భక్తి సాయంగా ఒక వెయ్యి నూట పదహార్లకు చెక్కును ఇందులో పంపుతున్నాను. స్వీకరించ ప్రార్థన.

*– మద్దాళి నిర్మల (విజయవాడ)*

*(మీ సహృదయత అది! – సం॥)*

నవంబరు 2016 'రచన'లో 'ఉత్తర రచన' చదివిన తరువాత నాకు వ్రాయటానికి ఏమీ మిగలలేదు. వారందరి అభిప్రాయమే నా అభిప్రాయము. మీకు నా హృదయపూర్వక అభినందనలు. మిమ్మల్ని, ఒంటిచేతిపై సాగే మీ కృషిని స్వయంగా చూసాను. దగ్గరగా ఉంటే (మీరు అంగీకరిస్తే) నా వంతు సాయంగా మీ కృషిలో పాలు పంచుకొని ఉండేదాన్ని. చాలా దూరంగా ఉన్నాను. మీరు తెలుగు భాష కోసం, 'రచన' పత్రిక కోసం చేసే తపస్సు శ్లాఘనీయము.

ఈ ఉత్తరంతో పాటు రు.2516/–కి ('రచన' పత్రిక చందా రు. 1400/– ; ప్రత్యేక సంచికకు నా వంతు రు. 1116/–) చెక్కు పంపిస్తున్నాను. రచనాభిమాని...

*– న్యాయపతి వెంకట మణి (హైదరాబాదు)*

*'రచన రజతోత్సవ విహంగ వీక్షణ'* సంచిక కోసం డిడి 10,232 రూ. పంపుతున్నాను. చెరి రూ. 5116/–, ఒకటి విజయనగరం, ఎ. విజయలక్ష్మికి, (ప్లాట్ 4, మారుతీనగర్ అనుకుంటాను ఆమె అడ్రసు). రెండవది నా కోసం. రజతోత్సవ సంచిక సంతృప్తికరంగా రావాలని కోరుకుంటున్నాను.

*– ఎన్. కళ్యాణ (విశాఖపట్టణం)*

*'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'* గురించి చదివిన తరువాత ఎప్పుడెప్పుడు అందుకొందామా అని ఎదురు చూస్తున్నాను. మీకు నా అభివందనలు. మీరు 'రచన' అనే చిన్న కథానిలయాని(గుడి)కి నాలుగు స్థంభాలతో శంఖుస్థాపన చేశారు. అది క్రమంగా ప్రముఖ రచయితల కథలతో నూరు స్థంభాల గుడిగా పెరిగింది. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా మన 'రచన' వేయి స్థంభాల దేవళంగా వజ్రోత్సవం జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

'రచన'ను భవిష్యత్తులో యువరచయితలు, పాఠకులు ప్రోత్సహిస్తారని ఆశిస్తాను. నూతన సంవత్సరం నుంచి నా వంటి ప్రవాసాంధ్రులకు తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు గురించి (ఉదా : ఆశుకవిత్వం), వాటిలో ప్రసిద్ధులయిన వారి గురించి క్లుప్తంగానైనా వివరించమని 'వసుంధర'గారిని కోరుతున్నాను. 'రచన' పాత పత్రికలు పేపర్లు కొనేవాడికి అమ్మడం ఇష్టం లేక గుంటూరులో ఉన్న అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయానికి పంపించాను. మీ రచనాభిమాని,

*– ఎస్.వి. రమణిరావు (ఢిల్లీ)*

పి.ఎస్. : నా చందా 'రచన' 294 నెంబరుతో అయిపోయిందనుకొంటాను. ఇందులో నేను రూ. 1950/–కి బ్యాంక్ ఆఫ్ బరోడా చెక్కు పంపుతున్నాను. వివరాలు : 1. రజోతత్సవ సంచికకి రూ.1116/–; 2. చందా రూ.700/–; 3. నెం.12, 1999 సంవత్సర పత్రిక రూ.130/–. మిగిలిన చిల్లర దేవుడికి చిరుదక్షిణ.

*(పాతికేళ్లు 'రచన'ను నడపలేకపోతానా అనుకున్నప్పుడు అది అత్యాశ అన్న మిత్రులు లేకపోలేదు. అనుకున్న లక్ష్యాన్ని అన్ని ఒడిదుడుకులనూ అధిగమిస్తూ చేరుకున్నాను. అది చాలు! నేను అల్పసంతోషిని. కొండను వెంట్రుక కట్టి లాగే ప్రయత్నం చేయలేను. పాత 'రచన'లను మీలానే ఏదేని గ్రంథాలయానికి ఇమ్మని అడిగిన వారికి చెబుతూ ఉంటాను.*

*పూర్వం చిల్లర శ్రీమహాలక్ష్మి అనుకునేవాళ్లం కదా! ఇప్పుడు చిల్లర కోసమే కాదు... చిన్ననోట్ల కోసమూ బేంకుల ముందు దేబిరించాల్సి వస్తోంది ప్రజలు. లక్ష్యం మంచిదే అయినా ముందు జనానికి నిత్యావసరాలు తీరాలి గదా! అన్నట్లు ఓ కాసయినా ఓ కోటయినా దక్షిణ దక్షిణే! – సం॥)*

ఎంతో కష్టపడి *'రజతోత్సవ సంపుటి'* తీసుకువస్తున్న మీకు అభినందనలు. ఈనాటి రోజుల్లో ఒక పత్రికకు ఎటువంటి

ప్రకటనలు లేకుండా ఇన్ని సంవత్సరాలు నడపటం సామాన్య విషయం కాదు. గట్టి సంకల్పం, ఎంత కష్టపడేతత్వం ఉన్న ప్పుడు అటువంటి మంచి పనులు చేసే వారికి భగవత్ అను గ్రహం ఉంటుందని పెద్దలు చెప్తుంటారు. ఇది మీ విషయంలో అక్షరాలా సత్యం.

ఎప్పుడో పదిహేను సంవత్సరాల క్రితం ఒకరోజు శ్రీ 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారు ఫోన్ చేసి, 'విశ్వపతిగారూ! మీ పేరుతో ఒక్క చక్కటి పాత్రను సృష్టించి కథ రాసాను' అని ఆ కథంతా ఫోన్‌లోనే చెప్పి వినిపించారు. ఆయన అభిమానా నికి ఎంతో ఆనందపడ్డాను. ఆ కథను 'రచన'కు ప్రత్యేక సంచిక కోసం రాసానని ఆయన చెప్పారు. ఆ మరుసటి నెలలోనే 'కార్తికేయుని కీర్తికాయం' అనే పేరుతో ఆ కథ మన 'రచన'లో వచ్చింది. అసలు సీతారామశాస్త్రిగారు కథలు రాస్తారని నాతో పాటు చాలామందికి తెలీదు. ఈ విషయం చాలా ఆశ్చర్యంగా అనిపించింది. అప్పటి నుంచీ నాకు 'రచన' నా హృదయానికి ఇంకా దగ్గర అయింది.

బాపుగారు నాకు రాసిన కొన్ని ఉత్తరాలను తీసుకుని 'రచన' శాయిగారిని కలిసాను. అదే ఆయన్ను మొదటిసారి కలవడం. ఆయన పుస్తకాల మధ్య ఏదో టైపు చేసుకుంటూ ఒక ఋషిలా కన్పించారు. ఒక తపస్సులాగా నిర్వహిస్తున్న వారికి నా చేతు లెత్తి దండం పెట్టాను. ఆ శ్రీనివాసుడు శ్రీ శాయిగార్కి శతవత్సర ఆయుష్షు ప్రసాదించాలని ఆ స్వామిని ప్రార్థిస్తున్నాను.

ఈ లెటర్‌తో పాటు మన రజతోత్సవ పత్రికకు ఉడతాభక్తిగా రూ.2116/- పంపుతున్నాను. స్వీకరించవలసిందిగా నా ప్రార్థన. వీలున్నప్పుడల్లా మీరు చేస్తున్న ఈ అద్భుత కృషికి సహాయం చేస్తూనే ఉంటాను.

– విశ్వపతి (హైదరాబాదు)

*(1997లో అనుకుంటాను సీతారామశాస్త్రిగారు ఓ రోజు రాత్రి పది గంటలకు ఫోన్ చేసి అరగంటకు పైబడి మాట్లా డేరు. 'రేపు 'రచన' కోసం మీకు పాతిక వేలు పంపుతా'నంటే, 'అది పక్కన ఉంచండి. పూర్వం 'భరణి' పేరుతో కథలు రాశారు కదా... ఇప్పటి బిజీలో సమయం చూసుకుని ఓ కథ రాసి పంపితే చాలా సంతోషిస్తా'నన్నాను. ఆ తర్వాత మూడేళ్లకి కాబోలు నా కోరిక మన్నించారాయన. అదీ సంగతి! – సం॥)*

'రచన' రజతోత్సవం జరుపుకొంటుందన్న వార్త నన్ను ఆనందపరిచింది. 'రచన' ఎప్పుడు నాకు నా చిన్నప్పుడు చూసిన 'భారతి'ని గుర్తు తెస్తుంది. నేను మొదటిసారి1991లో చూసాను – 'రచన'ను అనంతపురంలో నా స్నేహితుని ఇంటిలో. నా కప్పుడు అది మనోవైజ్ఞానిక పత్రికలాగా అనిపించింది. అయితే నా ప్రియమైన 'ఆంధ్రప్రభ' తరువాత ఏ పత్రికను ఆహ్వానించ లేకపొయ్యాను. అయితే మరలా 2005లో అనుకొంటా ఓ పాఠకుని ఇంటిలో మరలా చూసి చాలా ఇంప్రెస్ అయ్యాను. చందా కట్టి తెప్పించుకోవడం ప్రారంభించాను. అయితే 'రచన' మీద విసుక్కున్న రోజులు లేకపోలేదు. ఏమిటిది? ఏది వ్రాసినా చదివేస్తారన్న ధీమా కాబోలు ఈ సంపాదకులకి... ప్రతినెలా చూసిన వారి నవలలే, కథలే చదవాలి. ఆంధ్రప్రదేశ్‌లో ఇంక వేరే వాళ్ళు లేరా! అని అనుకొన్న రోజులు ఉన్నాయి. కొంత మంది మీతోబాటు కష్టాలను, సుఖాలను పంచుకొని ఉండ వచ్చును, మీకు అత్యంత శ్రేయోభిలాషులు ఉండవచ్చును. ఆ మాత్రానికే ప్రతి సంచికలోను వాళ్ళ రచనలే వస్తూండటం కొంచెం ఇబ్బందిగా అనిపించేది. ఈ తరం వారికి గుర్తులేని లబ్ధప్రతిష్ఠులయిన పాత రచయితల/రచయిత్రుల నవలలను మరోసారి ప్రచురించినా బాగుంటుంది. ఇది కేవలం నా అభి ప్రాయమే! ఇందులో మీరు ఏకీభవించాలని, ఒప్పుకోవాలని లేదు. కొత్త రచయితలకు అవకాశం కల్పించాలని నా ప్రార్థన. మీ మనసును, కొందరి మనసులను నొప్పించి ఉంటే క్షంతవ్యు డిని.

– కె.వి. శాస్త్రి (హైదరాబాదు)

*(నిష్పక్షపాతమైన మీ అభిప్రాయానికి కృతజ్ఞతలు! చాలామంది రచయితలు తమ కనువైన పత్రికలకు తమ రచనలను పంపు తుంటారు. వివిధ పత్రికలదీ అదే దారి. కొందరు తమ రచ యితలు ఇతర పత్రికలకు రాయడాన్ని సహించరు. మా వరకూ 'రచన' రచయితలను ఇతర పత్రికలకు కూడా రాయమనీ, తద్వారా ఇతర పాఠకులనూ అలరించమనీ కోరుతుంటాను. కానీ కొందరు ఎంతకాలమైనా 'రచన'లోనే తమ రచనలు రావాలని పట్టుబడుతుంటారు. 'రచన బాగున్నప్పుడు ఏ సంపా దకుడూ కావాలని వాటిని వదులుకోడు' అన్న పురాణం సుబ్ర హ్మణ్యశర్మగారి మాటలు గుర్తొస్తున్నాయి. పెద్దా చిన్నా రచ యితలన్న తేడా లేకుండా రచన బాగుంటే చాలు... 'రచన'లో ప్రచురించడం జరుగుతూ వస్తోంది. పాత రచనల పునఃప్రచు రణ మెదటి నుంచీ జరుగుతూనే వస్తోంది. ఇక కొత్త రచయి తలు దాదాపు వందమందికి పైగా 'రచన'లో అరంగేట్రం చేసేరు. 'రజతోత్సవ సంపుటి'లో మీకు మరింత విపులమైన సమాధానాలు దొరకగలవనుకుంటున్నాను. – సం॥)*

గత రెండు దశాబ్దాలుగా మేము (కామేశ్వరమ్మ & జి.వి. ప్రసాద్ దంపతులం 'రచన' పాఠకులం. 'రచన' గొప్పతనాన్ని గానీ, మీ దీక్షా దక్షతలనుగానీ ప్రశంసించేంత స్థాయి మాకు లేదు. రజతోత్సవ సంచికకూ, 10+2 సంచికలకూ రెండు చెక్కులు పంపుతున్నాను. నా వద్ద 2004 సం॥ నుంచీ అన్ని సంచికలూ ఉన్నాయి. కావున అంతకు ముందు సంచికలు

మాత్రమే పంపవలసిందిగా ప్రార్థన. చందా గడువు ఎప్పుడు ముగుస్తుందో తెలియపరిస్తే పొడిగింపు నిమిత్తం ఎమౌంట్ పంపుతాను. 20-12-16న మేము బోస్టన్ వెళుతున్నాము. దయచేసి యథాప్రకారం 'రచన' సంచికలు మా విశాఖ చిరునా మాకే మాకు పంపుతూ ఉండండి.

భగవంతుడు మీకు సమృద్ధిగా ఆరోగ్యైశ్వర్యాలను ప్రసాదించి, 'రచన' యింకా పదికాలాలపాటు వర్థిల్లాలని కోరుకుంటున్నాము.

*- యం. కామేశ్వరమ్మ (విశాఖపట్టణం)*

మన '*రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి*'ని సొంతం చేసుకోవాలనే కోరికతో, ఉడుతాభక్తిగా ఒక చిన్న మొత్తం చెక్కు ద్వారా పంపుతున్నాను. స్వీకరించగలరు.

మీ యీ క్రతువులో భాగస్వామ్యం పొందుతున్నందుకు చాలా సంతోషపడుతున్నాను.

ఆ ప్రత్యేక సంపుటి కోసం ఎదురు చూస్తుంటాను.

*- కొండపల్లి రామారావు (ఖమ్మం)*

*(క్రతువును నిర్వహించేది ఋత్విక్కులన్నది మీకు తెలిసిందేగదా! రచనాభిమానులే ఋత్విక్కులు! - సం॥)*

మీ పత్రికకు అభిమానిని. డిసెంబర్ సంచికలోని రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి 'వర్షం' ఇదివరకే చదివినా, బాపు-రమణ, నండూరి వారి ఉత్తరాలతో కమామీషు బాగా అలరించింది. రవీంద్రుని గీతాంజలికి శర్మగారి పేరడీ చాలా బాగుంది. 'రచన ప్రత్యేక సంపుటి' కోసం రు.1,116/- పంపుతున్నాను. స్వీకరించగలరు.

*- పి. ప్రశాంత్ కిరణ్ (విజయవాడ)*

'రచన' ప్రారంభోత్సవ సంచిక నుండి చదువుతున్న అశేష పాఠకుల్లో నేనూ ఒకడిని. ఆ రోజుల్లో మాకు 'రచనమిత్ర' అనే సర్టిఫికేట్ కూడ ఇచ్చినట్లు గుర్తు.

మీరు చేస్తున్న యజ్ఞంలో నా వంతు సహాయం చేయక పోవడం అనుచితం. పాతిక సంవత్సరాలు నిరంతరాయంగా ఒక పత్రిక నడపడం మీలో ఉన్న ఏకాగ్రత, మీ నిబద్ధత చాటుతుంది. చంద్రునికో నూలుపోగు చందాన దీనితో పంపిన రు.2,116/- చెక్కును స్వీకరించగలరు. మీ ఆధ్వర్యంలో 'రచన' ఇంకొక పాతిక సంవత్సరాలు నిరాటంకంగా సాగిపోవాలని మనస్ఫూర్తిగా పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను.

*- దూర్వాసుల దక్షిణామూర్తి (విశాఖపట్టణం)*

*(తొలి రోజుల్లో 100 సంచికల చందాదారులకు ఇచ్చిన 'చిరు జ్ఞాపిక' గురించి ఇప్పుడు మీరు ప్రస్తావించడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. మీ అమోఘ జ్ఞాపకశక్తికి జోహార్లు! - సం॥)*

*'రచన విహంగ వీక్షణ సంపుటి' కోసం (ఉఈ1ఇ1116/ - + రు. 700/- (రాబోయే రెండు సం॥ చందా పొడిగింపు).*

ప్రారంభ సంచిక విజయవాడ బస్టాండులో చూసి, కొని, ఇన్నేళ్లు ఒక్క సంచిక కూడా వదలకుండా హాయిగా అనుభవిస్తున్నాము. మనకు నచ్చిన పనిని ఎంత గొప్పగా, ఎంత శ్రమకోర్చి చెయ్యవచ్చో 'రచనను నడిపించడంలో మిమ్మల్ని తలచుకుంటే తెలుస్తుంది.

మా అబ్బాయి అంటుంటాడు - 'నా ప్రొఫెషనే నా పాసన్' అనీ, 'సో... నా పనిని నేను ఆనందంగా అనుభవిస్తున్నాను' అనీనూ. చాలా ఆనందంగా ఉంది. అభినందనలతో...

*- రమాదేవి నారాయణం (ఒంగోలు)*

*(మీ అబ్బాయి అనుకున్నట్లు ప్రతి ఒక్కరూ - ముఖ్యంగా మన రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తలు - తాము చేసే పని పట్ల నిజాయితీతో, నిబద్ధతతో ఉండి ఉంటే మన దేశం ఏనాడో బాగుపడి ఉండేది. 'అచ్ఛే దిన్' కోసం జనం ఇంతగా వెంపర్లాడుతూ క్షోభ చెందాల్సి వచ్చేది కాదు. - సం॥)*

*'రచన రజతోత్సవ సంపుటి'* తీర్చిదిద్దడానికి మీరు చేస్తున్న ప్రయత్నం.... ఉత్సాహం....లో ఏదో నా వంతు ఉడుతా భక్తిగా....

*- ఎన్.సి.ఎస్. సుధారమ (డోంబివిలి)*

*(మంగళంపల్లివారి 'మౌనమె నీ భాషా...' అన్న చందాన మీ ఉత్తరం... చెప్పకనే చాలా విషయాలు చెప్పింది - 'రచన'తో మీ పాతికేళ్ల అనుబంధం గుర్తుకొస్తోంది.... దాంతోపాటుగా రు.5,116/- చెక్కు!! సంతోషం! - సం॥)*

ఐ యామ్ సారీ, మీరు 2014 జూలైలో వ్రాసిన చందా గురించిన ఉత్తరం నాకు సకాలంలో అందక వెంటనే స్పందిచలేకపోయాను. అపుడు నా చందా 198 వరకే ఉండేది. నాకు 'రచన' ప్రతీ నెలా రెగ్యులర్‌గా వచ్చేది. అటువంటిది నేను కొంతకాలం కలకత్తా విడిచి వెళ్ళి వచ్చేసరికి ఇంక చందా 6, 7 నెలల్లో ముగుస్తోంది అనగా 'రచన' అందేది కాదు. ఒక్క రచనే కాదు మా ఫ్యామిలీలో అందరికీ వచ్చే మిగతా పుస్తకాలు, మేగజైన్స్ అందేవి కావు - వట్టి లెటర్స్ తప్ప. గేట్‌మన్ దగ్గర వాకబు చేసినా 'రాలేదండి' అనేవారు. మళ్ళీ హైదరాబాద్ రావటం పనులన్నీ చూసుకొని తిరిగి కలకత్తా వెళ్లేక చందా కడదామని అనుకున్నాను. ఆ సంగతి ఉత్తరం వ్రాద్దామనుకునీ కూడా వ్రాయటం వెనకబడింది. ఈ మధ్యలో చాలాకాలం పాటు కలకత్తా వెళ్ళటం కుదరనే లేదు. మొన్న అక్టోబరులో కలకత్తా వెళ్ళినపుడు మీ లెటర్‌ని ఎదుటి ఫ్లాట్ వారు ఇచ్చినప్పుడు 14-7-2014న నా చందా వివరాల గురించి వ్రాసిన ఉత్తరం చూశాను. 5 సంవత్సరాల పాటు 'రచనను చందా లేకుండా పంపించారని తెలిసి ఆశ్చర్యపోయాను. మా పాఠకు

లంటే 'రచనకి ఎంత నమ్మకం! అటువంటి 'రచనకు అభిమానులమూ, పాఠకులమూ కావడం నిజంగా మా అదృష్టం.

198 తరువాత పంపించిన 62 'రచన' సంచికలకు రూ. 1, 810/- పంపిస్తున్నాను. ఇపుడే 'రచన విహంగ వీక్షణ సంపుటి' గురించి తెలిసింది. రూ.1116/-'రజతోత్సవ రచనకై పంపిస్తున్నాను. దయయుంచి పంపగలరు.

*– అరుణ నిష్ఠల (సబ్ కోడ్ నెం. 0549) (హైదరాబాదు)*

*(మీరు తొలినాటి రచనాభిమానులలో ఒకరు. ఇంకా 'రచన'లో, 1994-2008 మధ్య కాలంలో, మీ కథలు తొమ్మిది ప్రచురింపబడినవి. మీకు పంపిన 'రచన' కాపీలు మూడు నాలుగు వాపసు వచ్చిన మీదట పంపడం ఆపేయడమైనది.*
*చాలా సందర్భాలలో సంచికల ప్రచురణలో ఆర్థికపరమైన కారణాలవల్ల నాగాలు పెట్టినా ఎంతో నమ్మకంతో రచనాభిమానులు ఓపిగ్గా భరిస్తూ వచ్చేరు. దాని ముందు 'రచన' పాఠకుల మీది మా నమ్మకం చాలా చిన్నబోయే విషయం! – సం॥)*

ప్రియమైన శ్రీ సాయిగారూ,

అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, మీరు చేస్తున్న సాహితీసేవకు, నిజానికి, మిమ్మల్ని గౌరవనీయులు అని సంబోధించాలి. కానీ ఆ సంబోధన మనుష్యుల మధ్య దూరాన్ని పెంచేదిగా ఉందనిపించి, ఇలా సంబోధించడం జరిగింది. మన్నించగలరు. 'రచన రజతోత్సవ సంపుటి' తేబోయే మీకు, నా మనఃపూర్వక శుభాకాంక్షలు. ఈ సందర్భంగా, మా 'సాయి' చంద్రునికి, ఓ నూలుపోగుగా, ఒక వెయ్యి నూట పదహార్లకు చెక్కు పంపుతున్నాను. స్వీకరించగలరు.

నేను 'రచన' ప్రథమ సంచిక, అప్పుడెప్పుడో పాతికేళ్ళ క్రిందట, బెజవాడ బస్‌స్టాండ్‌లో కొనడం జరిగింది. అప్పట్లో నాకో దురలవాటు. బెజవాడ బస్‌స్టాండ్‌కు వెడితే, నా బస్ గురించి వెదికే వాడిని గాదు. ముందు – అక్కడి పుస్తకాల షాపు ముందు నిలబడి పుస్తకాల వంక చూస్తూ ఉండేవాడిని, మా ఆవిడ తిడ్తున్నప్పటికినీ! అలా నిలబడ్డ క్రమంలో, 'రచన' కనబడ్డం, ఆ కవర్ పేజీపైన బాపుగారు చెక్కుడు కనబడ్డం, కొనేయడం జరిగింది. అయితే, ఆ తరువాత ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, మానకుండా, మీరు పత్రిక తేవడం జరిగింది!!! ఆర్థిక ఇబ్బందులనిపించడం వల్ల, నేను పత్రికను వరుసగా కొనలేకపోవడం జరిగింది!!

ఉద్యోగంలో నుండి, విశ్రాంతి పొందిన తర్వాత, నాకు 'రచన' తోడు కావాలనిపించింది. వెంటనే చందా కట్టాను. ప్రస్తుతం నాకు నా భార్య తర్వాత 'రచన' మంచి తోడు.

'రచన'లో నాకు చాలా ఇష్టమైనదేమిటంటే బాపుగారి ప్రస్తావన. వారి గురించి, ఏమి వ్రాసినా, ఎంత వ్రాసినా, అర్థమైనా, కాకపోయినా నా కిష్టమే! నా ఏడో ఏట (1960) నుండి నాకు ఆయన ఇష్టం. ఎందుకో అప్పుడు తెలవదు, అని చెప్పగలను. ఎందుకో ఇప్పుడు తెలిసినా, చెప్పలేను.

విసిగిస్తే మన్నించండి. కనీసం ఇంకొక్క 50 'రచన'లు (యాభై 'రచన'లు) తెచ్చే శక్తి ఆ భగవంతుడు మీ కివ్వాలని, చదివే అదృష్టం పాఠకుల కివ్వాలని, ప్రార్థిస్తూ... భవదీయుడు,

– కె.వి. రాఘవరెడ్డి *(విజయవాడ)*

*(ఆర్థిక ఇబ్బందులు అందరికీ ఒకటే! వాయిదా పద్ధతుల్లో అయినా మీ అభిమానాన్ని చూరగొనగలిగినందుకు చాలా సంతోషిస్తున్నాను. బాపుగారి గురించి మీరన్న 'చెప్పగలను... చెప్పలేను' మాటలు ఊహకు మించిన భాష్యం చెప్పకనే చెబుతున్నాయి. మీ ప్రార్థనలు ఎంతవరకూ ఫలిస్తాయో అన్నదానికి రాబోయే కాలం మాత్రమే జవాబు చెప్పగలదు. – సం॥)*

'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' ప్రచురించే బృహత్ కార్యక్రమం చేపట్టినందుకు మీకు అభినందనలు!

ఈ ప్రచురణలో నేనూ పాలుపంచుకోవాలనే ఉద్దేశ్యంతో నా వంతు ఉడతాభక్తిగా రు.1,116/-లు పంపుతున్నాను. దయచేసి అంగీకరించండి. సంచిక వెలువడినప్పుడు వీలు వెంబడి నాకూ ఓ కాపీ పంపుతారని ఆశిస్తాను.

గతంలో నేను పంపిన నా కార్టూన్లు 'రచన'లో చోటుచేసుకున్నందుకు ఎప్పుడూ గర్వపడతాను. మీరు ఈ బృహత్కార్యం జయప్రదంగా జరగాలని కోరుకుంటూ...

– ఎమ్మెస్ రామకృష్ణ *(హైదరాబాద్)*

*(మీబోటి వారి ఐచ్ఛిక అండదండలతోనే 'రచన' పేజీలు నిండుదనాన్ని సంతరించుకున్నాయన్నది కాదనలేని సత్యం! – సం॥)*

మీరు తలపెట్టిన బృహత్కార్యం సఫలమవ్వాలనీ, మరెంతో మందికి స్ఫూర్తిగా నిలవాలనీ కోరుకుంటున్నాను. నేను సుమారు 12 సం॥ నుండీ 'రచన' చదువుతున్నాను.

దాదాపు అన్ని సంచికలూ అద్భుతంగా వుంటున్నాయి.

ఒక మాజీ వుపాధ్యాయినిగా నాకు ప్రభుత్వం వారిచ్చే *'గౌరవ వేతనం'* (పెన్షను)లో నుండి వుడతాభక్తిగా 1,116 రూ॥లు పంపుతున్నాను. స్వీకరించగలరు.

– కానాల నాగలక్షుమ్మ *(విశాఖపట్టణం)*

పాతికేళ్ళ ప్రచురణ పూర్తిచేసుకున్న సందర్భంగా అభినందనలు! ప్రారంభం నుంచీ 'రచన' చదివి ఆనందిస్తున్నాను.

మీ ఎఫర్ట్స్‌ని అభినందిస్తూ, ఇలాగే చాలా ఏళ్లు కొనసాగించాలని కోరుకుంటున్నాను.

*– శ్రీలక్ష్మి (గుర్‌గావ్)*

మీరు తలపెట్టిన *'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'* కోసం ఉడుతాభక్తిగా చెక్ (రు.1,116/-) పంపుతు

న్నాను. దయచేసి స్వీకరించగలరు. నేను ప్రారంభ సంచిక నుండి చదువుతున్నాను. మీ కృషి అభినందనీయం! ఎంత ప్రశంసించినా తక్కువే! 'చందమామ', 'రచన' అంటే ప్రాణం.

– *తోట రాజేశ్వరి (విశాఖపట్టణం)*

'రచన' ప్రారంభోత్సవ సంచిక నుండి 'రచన అభిమానిని. నా చందా నె.1673. ప్రస్తుతం '*రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి*' కోసం రు.1,116/– పంపుచున్నాను.

జయదేవ్‌గారి కార్టూన్లు 'రచన'లో రావటం ఎంతో సంతోషంగా వుంది. ఒకప్పుడు '60లలోనో, '70లలోనో జయదేవ్ గారు ప్రముఖులందరి మీద చిన్న పద్యాలతో కార్టూన్లు వేశారు. '*ఆంధ్ర సచిత్ర వారపత్రిక*'లోనో లేక '*ఆంధ్రప్రభ వారపత్రిక*' లోనో... అప్పట్లో రెండూ తెప్పించేవాళ్లం. ప్రారంభమే శ్రీశ్రీకి నమస్కార బాణంతో మొదలు. భానుమతి, మాలతీ చందూర్... అందరి మీద వేసారు. ఎంతో బాగుండేవి. అవన్నీ కలెక్ట్ చేసి పెట్టాను. ప్రస్తుతం లేవు. ఎవరికిచ్చింది కూడా గుర్తులేదు. మాలతీ చందూర్ మీది కార్టూన్‌లో 'అణువు నుండి అరిసె దాక అడగవచ్చు' అని మొదలవుతుంది. ఇదంతా రాయటం ఎందుకంటే వాటిని ఎలాగైనా మళ్లీ ప్రచురించమని కోరటానికే!

– *డి. వసుంధర (కావలి)*

*(మీ కోరిక పాక్షికంగా ఇక్కడ తీరుస్తున్నాము... మరో ఇరవై తొమ్మిది తూణీరాలు పోస్టు ద్వారా! 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక'లో 1969లో ప్రచురింపబడ్డాయి ఈ తూణీరాలు. – సం॥)*

'*రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి*'ని అందుకోవాలన్న ఆకాంక్షతో చెక్(రు.5,116/–)ని ఈ ఉత్తరానికి జతచేస్తున్నాను. ఈ రోజే ఊరి నుంచి రావటంతో స్వయంగా కలిసి ఇవ్వటం కుదరలేదు... అందుకనే పోస్ట్ ద్వారా పంపుతున్నాను.

– *శ్రీఉదయిని (హైదరాబాదు)*

*(స్వయంగా కలవటం కన్నా మీబోటివారి అభిమానధనమే మిన్న. సిటీలో ఉన్నా ఒకచోటు నుంచి మరోచోటికి వెళ్లడం అన్నది పైఊరి ప్రయాణం కన్నా ఎక్కువే కదా! – సం॥)*

చాలా ఏళ్లుగ, ఇంచుమించు మొదటి నించి 'రచన' చదువుతున్నాను. నా అభిమాన పత్రిక రజతోత్సవానికి ఉడతాభక్తిగ 1,116 రు॥ పంపుతున్నాను. రజతోత్సవ సంపుటి ఆకర్షణీయంగ, అద్భుతంగ రావాలని కోరుకుంటున్నాను. ఆత్రుతగా ఎదురు చూస్తున్నాము. మీరు అనుకున్నట్లుగ చాలా ఆకర్షణీయంగ తయారుకావాలని కోరుకుంటున్నాను.

– *పోతరాజు లక్ష్మి (పూణే)*

మీరు తలపెట్టిన మహాయజ్ఞంలో నాక్కూడా చిన్న భాగం కల్పించమని అభ్యర్థిస్తూ, నేను పంపిస్తున్న ఈ 1,116/– రూపాయలు స్వీకరించమని కోరుతూ...

– *సి.వి. శాస్త్రి (విశాఖపట్టణం)* ✪

## అక్షయ తూణీరం

కార్టూను గేయాలు

✻ శిశిర ✻




1. మొట్టమొదట శ్రీశ్రీకి
నమస్కార బాణమేసి
ప్రాస క్రీడల జాడల
నవ్వించెద, కవ్వించెద!

(12–9–1969)



30. అరిసె నుండి అణువు దాక
అడగవచ్చు మీ ఓపిక
విప్పే పనివాడితనం
మాలతీ ప్రమోదవనం!

(28–11–1969)



'సుబ్బారాయుడు (రమణారెడ్డి) | తాయారు (హేమలత) | పార్వతమ్మ (లక్ష్మీకాంతం)



రఘురామ్ (జగ్గయ్య) | శోభ (గిరిజ) | రంగయ్య (పెరుమాళ్ళు)



లక్ష్మి (దేవిక) | చంద్రం (రమణమూర్తి) | సుందరమ్మ (సూర్యాకాంతమ్మ)

ఇది 'అత్తా ఒకింటి కోడలే' చిత్రం బొమ్మల కథ ప్రకారం సర్వం సమాప్తం

ఇది చదివినవారికి, సినిమా చూసినవారికి సర్వకష్టాలుపోయి సర్వశుభాలు కలుగుతాయి

స్వంతదారు. సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త : వై.వి.యస్.ఆర్.యస్. శాయి :: దూరవాణి : 27071500
చిరునామా : 'యడ్లపాటివారి ఇల్లు' ; 1-9-286/2/పి, విద్యానగర్ ; హైదరాబాదు - 500 044
ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, 1-9-1126/బి ; అజామాబాద్ ; హైదరాబాదు - 500 020

# శృంగారనాయికలు

అష్టవిధ నాయికల వర్గీకరణ మొట్టమొదట భరతముని (2వ శతాబ్దం-బిసి నుండి 2వ శతాబ్దం-ఎడి) సంస్కృతంలో రచించిన 'నాట్యశాస్త్రం'లో పేర్కొనబడినది. ఈ వర్గీకరణ వివరాలు తర్వాత రచనలైన 'దశరూపకం' (10వ శతాబ్దం), 'సాహిత్య దర్పణం' (14వ శతాబ్దం) మరియు ఇతర కామశాస్త్ర గ్రంథాలలో తెలిపాయి. కేశవదాసు హిందీలో రచించిన 'రసికప్రియ' (16వ శతాబ్దం)లో కూడా అష్టనాయికలను విశదీకరించిరి.

అష్టవిధ నాయికలు భారతీయ చిత్రకళ, సాహిత్యం, శిల్పకళ మరియు శాస్త్రీయ నృత్య సాంప్రదాయాలలో తెలుపబడ్డాయి.

మధ్యయుగపు చిత్రకళాఖండాలైన 'రాగమాల' చిత్రాలు అష్టవిధ నాయికలను ప్రముఖంగా చిత్రించాయి.

భారతీయ సాహిత్యంలో జయదేవుడు 12వ శతాబ్దంలో రచించిన 'గీతగోవిదం'లోను మరియు వైష్ణవి కవి 'వనమాలి' రచనలలో రాధ వివిధ నాయికల భూమిక పోషించ, నాయకుడిగా శ్రీ కృష్ణుడు కీర్తించబడ్డాడు.

## 1. స్వాధీనపతిక

స్వాధీనపతిక లేదా స్వాధీనభర్తృక : 'స్వాధీనుడగు భర్త గల నాయిక'
ఈమెలోని ప్రగాఢమైన ప్రేమ మరియు సుగుణాలకు భర్త పూర్తిగా ఆధీనుడౌతాడు.
చిత్రకళలో ఈ నాయికను నాయకునితో పాదాలకు పారాణినిగాని లేదా నుదుట తిలకంగాని దిద్దుతున్నట్లుగా చూపిస్తారు. జయదేవుడు 'గీతగోవిందం'లో రాధను స్వాధీనపతికగా వర్ణించాడు. రాధమాధవుల రతిలో చెదిరిన తన అలంకరణను శ్రీకృష్ణునితో సరిచేయించుకుంటుంది.



## 1. స్వాధీనపతిక

ఇరులలో తారక లివి యంచు, తానె నా
　　కురులలో మల్లియ విరులు తురుము!
అసలె కెందమ్ము లీ అడుగు లనుచు, ఎంతొ
　　పొందుగా లత్తుక పూయు తానె!
అది యేదొ అంటె నీ అధరాన నని, తన
　　మెత్తని పెదవుల నొత్తి తుడుచు!
చూచుచు, మరి మరి చూచి మెచ్చుచు, మక
　　రికల చెక్కిళ్ల చిత్రించు తానె!

ఎంత పున్నెమ్ము చేసినానే, మగండు
ఒక్క క్రీగంటి చూపులో, ఒక్క లేత
నగవులో, నా మనస్సు నెరిగి, గ్రహించి,
తీర్చునే యంచు, మురియు, 'స్వాధీనపతిక'

– దేవులపల్లి కృష్ణశాస్త్రి

DATE OF PUBLICATION : 27-12-2016 :: DATE OF POSTING : 1st (or) 2nd of Every Month




సాదా సీదాగా రజతోత్సవ సంవత్సరం దాటిపోదాం అనుకున్నా, ఓ ఆత్మీయ మిత్రుడి పట్టుదల కారణంగా రజతోత్సవ సంచికకు శ్రీకారం చుట్టక తప్పలేదు. ఒకసారి అంకురార్పణ జరిగిన తర్వాత ఆలోచనల పరిధి పెరిగి ఆ ప్రయత్నం వటుడింతై అన్న చందాన విస్తృతమైపోతోంది.

కేవలం కొన్ని ప్రముఖ రచనలను గుదిగుచ్చి తయారు చేయడం ఇలాంటి సందర్భాలలో పరిపాటి. అలా కాకుండా పాతికేళ్ల 'రచన' ప్రస్థానాన్ని సవివరంగా అవలోకనం చేయాలన్నది మా అభిలాష!

✪ ✪ ✪

ఈ పాతికేళ్లలో 'రచన'ను సుసంపన్నం చేసిన వారెందరెందరో ...... వారందర్నీ సూచనామాత్రంగానైనా పేరు పేరునా తలచుకోవడం మా విధి, విద్యుక్తధర్మం!

ఈ సంపుటిలో గత పాతికేళ్లలో అందించిన శీర్షికల నమూనాలు; కొన్ని విలక్షణ రచనలు; కథలు; కార్టూన్లు; రంగుల బొమ్మలు; మరింకెన్నెన్నో విశేషాలు దర్శనమిస్తాయి. ఏతావాతా 294 సంచిక(1,224 రంగుల పేజీలతో కలిపి మొత్తం 30,440 పేజీలు)లలో ప్రచురింపబడిన రచనా సంపదను కేవలం నాలుగు వందల పేజీలలో చూపించ బూనడం అసాధ్యమే అయినా కొంతలో కొంతయినా సాధ్యమనిపించేలా చేయగలమనుకుంటున్నాము.

'రచన' ఎందరో నూతన రచయితలతో సహా రచయితలుగా రూపాంతరం చెందిన పాఠకులకు వేదిక అయింది. వారందరూ ఈనాటికీ సాహితీ సేవను కొనసాగిస్తున్నారు. అలాంటి వారి కథలూ తప్పక ఉంటాయి. ప్రత్యేక కారణాల నేపథ్యంలో ఎంపిక చేయబడిన కొందరు ప్రముఖుల కథలుంటాయి – ఆ నేపథ్య వివరణతో.

ప్రారంభం నుంచీ 'రచన'తో మమేకమై విడదీయరాని అనుబంధమేర్పరచుకున్న ఇద్దరు ప్రముఖ రచయితల విపులమైన విశ్లేషణాత్మక వ్యాసాలు రెండు 'రచన' పాతికేళ్ల ప్రస్థానాన్ని సవివరంగా పరిచయం చేస్తాయి. అలనాటి సాహితీ దిగ్గజాల సమూహ ఛాయాచిత్రాలు రెండు అదనపు ఆకర్షణ! శ్రీపాద లాంటి సుప్రసిద్ధులైన కొందరు ప్రముఖ రచయితల అపురూప ఉత్తరాలు మరీ ప్రత్యేకం!

పద్దెనిమిదేళ్ల తర్వాత ఓ ప్రముఖ రచయిత రాసిన సరికొత్త కథ మరో విశేష ఆకర్షణ అయే అవకాశం మెండుగా ఉంది,

ఎవరూ ఊహించలేని ఒక 'విశేష విభాగం' కూడా ఈ సంపుటిలో చోటుచేసుకోగలదనుకుంటున్నాము.

✪ ✪ ✪

ఈ సంపుటి మామూలు పత్రికగా కాకుండా ప్రత్యేకంగా పుస్తక రూపంలో 'మంచి కాగితం'తో వెలువడుతుంది. ఇప్పటి ఉజ్జాయింపు అంచనా ప్రకారం ఈ సంపుటి 1/4 డెమి సైజులో 400 వందల పేజీలకు తగ్గదనుకుంటున్నాము.

ఖర్చు మూడు లక్షల పైమాటే!

'రచన'ను ఇన్నేళ్లుగా అక్కున చేర్చుకుని నిలబెట్టిన వారు రచనాభిమానులైన పాఠకులేనన్నది నిర్వివాదాంశం! అందుకే వారిని కూడా తప్పకుండా ఈ బృహత్ ప్రయత్నంలో పరోక్ష భాగస్వాములను చేయాలన్న సంకల్పం కలిగింది. ఈ *'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'*ని వారికి మాత్రమే పరిమితం చెయ్యాలని కూడా అనుకుంటున్నాము.

1, 5, 10, 15, 20 సంఖ్యలలో ఒకదానిని నూటపదహారు రూపాయలకు ముందు చేర్చి ఈ క్రతువులో భాగస్వామ్యం పొందవచ్చును. రచనాభిమానులు పెద్ద మనసుతో వితరణ చూపి ఈ సంపుటిని సొంతం చేసుకోగలరనే ఆశాభావం! ఆ విధంగా ఈ 'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' ప్రచురణలో రచనాభిమానులు సైతం పాలు పంచుకోవచ్చును.

మీరందించబోయే పౌష్టికాహారం శ్రీహేవిళంబి ఉగాది నాటికి అందితే చాలు!

విదేశాల్లో ఉన్న రచనాభిమానులకు వారి ఇండియా చిరునామాకి మాత్రమే ఈ సంపుటి పంపగలము.

ఉగాది సంచికలో విడుదల ప్రకటన చూడగలరు.

పాతికేళ్ల 'రచన' కృషికి దర్పణం పట్టడం మావంతు!
ఒక పత్రిక రజతోత్సవ సంచిక ఇలా కూడా
ఉంటుందా అన్న చందాన ఆశ్చర్యపోవడం మీ వంతు!

'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' ప్రచురణలో భాగస్వామ్యం కోసం మీరు పంపదలచిన విరాళాలు మల్టిసిటీ చెక్/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా 'రచన' పేరిట పంపగలరు.